

రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం సాకారానికి ప్రభుత్వం నడుం బిగించింది. గత ఐదేళ్ల విధ్వంసం నుంచి పురోగమనానికి అడుగులు వేస్తోంది. రాష్ట్రం మొత్తం ముక్తకంఠంతో నినదించిన 'అమరావతి రాజధాని' పునర్నిర్మాణం (రీస్టార్ట్) పనులకు శుక్రవారం శంకుస్థాపన చేయనుంది. ఈ వేడుకను ప్రధాని మోదీ చేతుల మీదుగా మొదలు పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని కనులారా చూసేందుకు జిల్లా ప్రజానీకం తండోపతండాలుగా తరలిపోతోంది. అమరావతి ప్రాంతంలో నిర్వహిస్తున్న భారీ సభకు రాజధాని చుట్టుపక్కల జిల్లాల నుంచి జనం వచ్చేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అధికార యంత్రాంగం, టీడీపీ నేతలు ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. తొలుత వాహనాల ఏర్పాటు వరకే జిల్లా యంత్రాంగం బాధ్యత అనుకున్నప్పటికీ బుధవారం రాత్రి జన సమీకరణకు కూడా రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల నుంచి సూచనలు రావడంతో జిల్లా దారులన్నీ అమరావతివైపే చూపిస్తున్నాయి.

పునర్నిర్మాణోత్సవం
చూసొద్దాం

నేడు అమరావతి రీస్టార్ట్ పనులకు శంకుస్థాపన చేయనున్న ప్రధాని

- రాజధానిలో బహిరంగ సభకు జిల్లా నుంచి తరలుతున్న జనం
- ప్రభుత్వ యంత్రాంగం, టీడీపీ ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు
- త్రోవగుంట నుంచి చీరాలవైపు వాహనాల మళ్లింపు
- నాడు అమరావతి రైతుల పాదయాత్రకు స్వాగతం పలికిన జిల్లా ప్రజలు


అమరావతికి వెళ్లేందుకు ఒంగోలులోని మినీ స్టేడియంలో గురువారం అర్ధరాత్రి సిద్ధమై ఉన్న బస్సులు

ఒంగోలు, మే 1 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునర్నిర్మాణ (రీసార్ట్) పనులు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేయనున్నారు. నాడు అమరావతి రాజధానిని వైసీపీ విధ్వంసం చేస్తే దానికి నిరసనగా రాజధాని రైతులు చేపట్టిన పాదయాత్రకు జిల్లా ప్రజానీకం నీరాజనం పలికారు. 20 రోజులకుపైగా ఉమ్మడి జిల్లాలో ఆ యాత్ర సాగగా అడుగడుగునా ప్రజలు సంఘీభావం తెలుపుతూ యాత్రలో పాల్గొన్నానడమే కాక కోట్లాది రూపాయలు విరాళాలు ఇచ్చారు. తాజాగా పునర్నిర్మాణ కార్యక్రమానికి కూడా అంతే ప్రాధాన్యత నెలకొంది. జిల్లా నుంచి రెవెన్యూ అధికారులు కూడా అక్కడ ఏర్పాట్లలో భాగస్వాములు అవుతున్నారు. ఐదారుగురు డిప్యూటీ కలెక్టర్లు, పదిమంది తహసీల్దార్లు, ఆరుగురు జిల్లాస్థాయి అధికారులు ఇందుకోసం రెండు రోజుల క్రితమే అక్కడికి వెళ్లి విధులు నిర్వహిస్తుండగా జిల్లా నుంచి జనం తరలింపులో పలువురు జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు.

30 వేల మంది తరలింపు

ప్రభుత్వ సూచన, టీడీపీ అధిష్ఠానం ఆదేశంతో జిల్లా నుంచి సుమారు 30వేల మంది అమరావతికి హాజరయ్యేలా ఏర్పాట్లు చేశారు. 188 బస్సులను సిద్ధం చేశారు. ఒంగోలుకు 60 బస్సులు కేటాయించగా సంతనూతలపాడుకు 40, కొండపికి 20, దర్శికి 25, మార్కాపురానికి12, వైపాలెంకు 13, గిద్దలూరుకు 8, కనిగిరికి 10 బస్సులు కేటాయించారు. పలు కాలేజీల బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలను సిద్ధం చేస్తున్నారు. గురువారం రాత్రికే గ్రామాలకు బస్సులను పంపి శుక్రవారం ఉదయం 9గంటలలోపు ప్రారంభమై మధ్యాహ్నం 12లోపు సభాప్రాంగణానికి చేరేలా ప్రణాళికలు రూపొందించారు.

చీరాలవైపు ట్రాఫిక్ మళ్లింపు

అమరావతిలో ప్రధానమంత్రి సభ నేపథ్యంలో విజయవాడ కేంద్రంగా సాగే రాకపోకలకు వీలుగా జిల్లాలో శుక్రవారం ట్రాఫిక్‌ను మళ్లించారు. అందులో నిత్యం అత్యంత రద్దీగా ఉండే చెన్నై-కోల్‌కత్తా రహదారిపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ రహదారి ఒంగోలు నుంచి పోతుండగా చెన్నై నుంచి ఒంగోలు మీదుగా విజయవాడ, విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలను నగరపరిధిలోని త్రోవగుంట నుంచి చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, హనుమాన్ జంక్షన్ మీదుగా మళ్లించారు. విశాఖ నుంచి చెన్నైవైపు వచ్చే వాహనాలను కూడా ఇదే రూటులో వచ్చేలా ఏర్పాటు చేశారు.

ఎగిరింది.. ఎర్రజెండా

- జిల్లావ్యాప్తంగా మేడే వేడుకలు
- పలుచోట్ల ర్యాలీలు, సభలు

జిల్లావ్యాప్తంగా గురువారం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. వాడవాడలా ఎర్రజెండాలు రెపరెపలాడాయి. చాలాచోట్ల కార్మికులు ర్యాలీలు నిర్వహించారు. ఒంగోలు, చీమకుర్తి, గుళ్లాపల్లి, టంగుటూరు తదితర ప్రాంతాల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలతోపాటు సభలు నిర్వహించారు. సీపీఐ, సీపీఎం అనుబంధ కార్మిక సంఘాలైన ఏఐటీయూసీ, సీఐటీయూల ఆధ్వర్యంలో మేడే సంబరాలు నిర్వహించారు.

లోపలి పేజీల్లో..


ఒంగోలులో జరిగిన ర్యాలీలో కార్మికుల సంబరం


గిద్దలూరులో గాలికి విరిగిపడిన చెట్టు

పశ్చిమంలో గాలివాన

- ఉరుములు, మెరుపులతో భయపెట్టిన వర్షం
- గిద్దలూరు, బీపేట, పెద్దదోర్నాలలో నేలకొరిగిన చెట్లు, స్తంభాలు ..
- ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు

గిద్దలూరు టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు ప్రాంతంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈదురు గాలులకు చెట్లు రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. పొలాల్లోని నిమ్మ చెట్లు సైతం గాలికి నేలకొరిగాయి. సాయంత్రం 4 గంటల నుంచి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై బలమైన ఈదురు గాలులు వీచాయి. ఈ గాలులతో పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్ సమీపంలో పెద్ద వేపచెట్టు నేలకొరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో గిద్దలూరు నుంచి పోరుమామిళ్ల వెళ్లే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొప్పువారివీధిలో విద్యుత్ స్తంభం విరిగిపడింది. రేడియోబావి సెంటర్‌లోని చెట్టు ఈదురు గాలులకు విరిగిపడింది. మండలంలోని వెంకటాపురం గ్రామంలో సాయంత్రం వీచిన గాలులకు గ్రామంలోని పలు స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. గురువారం పొద్దుపోయే వరకు విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేశారు. యడవల్లి సమీపంలోని నిమ్మతోటలో చెట్లు గాలికి నేలకొరిగాయి. విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

నిమ్మ చెట్లకు గాలివాన దెబ్బ

పెద్ద దోర్నాల: గాలివానకు నిమ్మ చెట్లు నేలకొరిగి అపార నష్టం వాటిల్లింది. మండలంలోని యడవల్లి గ్రామంలో గురువారం సాయంత్రం ఉరుములు మెరుపులతో ఈదురు గాలులు వీచి వేర్లతో సహా నిమ్మచెట్లు పడిపోయాయి. యడవల్లి గ్రామానికి చెందిన నల్లబోతుల ఆంజనేయులు 2 ఎకరాలలో 70 నిమ్మచెట్లు, ఎర్రబాలెం వెంకట సాయి రమేష్‌కు చెందిన 2 ఎకరాలలో 60 చెట్లు పడిపోయాయి. నిమ్మకాయలు కూడా నేలరాలాయి. దీంతో లక్షన్నరకు పైగా నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.


పెద్ద దోర్నాల మండలం యడవల్లిలో గాలికి నేలవాలిన నిమ్మచెట్టు

కోనపల్లెలో భారీ వర్షం

బేస్తవారపేట : మండలంలోని కోనపల్లెలోయలో గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గలిజేరుగుళ్ళ, శింగరపల్లె, శింగసానిపల్లె, పోగుళ్ళ, చెన్నుపల్లె, కోనపల్లె గ్రామాల సమీపంలో గాలులు, వానకు ఇళ్ల రేకులు లేచిపోయాయి. గలిజేరుగుళ్ల - శింగరపల్లె రోడ్డుపై అడ్డంగా చెట్టు పడడంతో రెండు గంటలపాటు రాకపోకలు నిలిచిపోయాయి. కోనపల్లెలో వేరుశనగ, గలిజేరుగుళ్లలో వరి పైర్లు కోసం పొలంలో ఉండగా కొందరి రైతుల పంటలు దెబ్బతిన్నాయి.

నగదు రూపేణా సుపారీ

- వీరయ్య చౌదరి హత్యలో ఇసుక వ్యాపారి కీలకం
- పారిశ్రామికవేత్త పాత్రపై పోలీసుల దృష్టి

ఒంగోలు క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): వీరయ్య చౌదరి హత్యకు కిరాయి హంతకులకు సుపారీ నగదు రూపేణా చెల్లింపులు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిసింది. హత్య కేసులో కీలకంగా మారిన ఇసుక వ్యాపారి, సూత్రధారులు, పాత్రధారుల మధ్య ఎలాంటి సంబంధాలూ లేకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు కిరాయి హంతకులకు ఆన్‌లైన్ చెల్లింపులు చేసిన దాఖలాలు కనిపించలేదు. అదే సమయంలో పారిశ్రామికవేత్తతో ఇసుక వ్యాపారికి ఎలాంటి పరిచయాలున్నాయి, ఎవరి ద్వారా పరిచయమైంది అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. అమ్మనబ్రోలుకు చెందిన సిద్ధాంతి ద్వారా ఇసుక వ్యాపారికి నగదు అందినట్లు ప్రచారం నడుస్తోంది. అయితే కిరాయి హంతకులకు ఖర్చుల నిమిత్తం ఇచ్చిన పెద్దమొత్తంలో నగదు ఇసుక వ్యాపారి వద్దే ఉన్నట్లు పోలీసులు అంచనాకు వచ్చారు. హత్యకు పథక రచన చేసిందెవరు, సహకరించిది ఎవరు అనే అంశంపై పోలీసులు దృష్టి సారించారు. ఇప్పటికే హత్య కేసులో ఇసుక వ్యాపారి కీలకంగా మారాడు. అతని కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. నేరుగా హత్యలో పాల్గొన్న నలుగురిని పోలీసులు గుర్తించారు. ఇరువురిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. వారి ద్వారా మిగిలిన ఇద్దరి సమాచారం సేకరించే పనిలో ఉన్నారు.

ఇసుక వ్యాపారి కీలకం

నగరంలో సెలూన్ షాపులు నిర్వహిస్తూ ఇసుక వ్యాపారం చేస్తున్న వ్యక్తి కేసులో కీలకంగా మారాడు. సూత్రధారులకు, పాత్రధారులకు మధ్యవర్తిత్వం చేసి హత్య చేయించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అదేసమయంలో సుపారీ భారీ మొత్తంలో తీసుకొని హత్య జరిగిన తరువాత పరారైనట్లు తెలుస్తోంది. సుపారీ మొత్తంలో హత్యకు ముందు సగం, జరిగిన తర్వాత సగం ముట్టజెప్పినట్లు అనుమానిస్తున్నారు. ఇసుక వ్యాపారి దొరికితేనే చిక్కుముడులు వీడతాయి.

పారిశ్రామికవేత్త పాత్రపై దృష్టి

వీరయ్య చౌదరి హత్య కేసులో పోలీసులు అనుమానిస్తున్న పారిశ్రామికవేత్త పాత్రపై పోలీసులు దృష్టిపెట్టారు. ఇసుక వ్యాపారి పారిశ్రామికవేత్తను ఎప్పుడు ఎక్కడ కలిశాడు అనే కోణంలో ఆరా తీయగా, సిద్ధాంతి కీలకంగా వ్యవహరించినట్లు కొన్ని ఆధారాలు దొరికాయని సమాచారం. ఇంకా స్పష్టమైన ఆధారాల కోసం పోలీసులు పలు కోణాల్లో విచారణ చేస్తున్నారు. సుపారీ నగదుతో జరిగినట్లు గుర్తించి ఇంత పెద్దమొత్తం సిద్ధాంతికి ఎలా వచ్చింది అనే అంశాన్ని పోలీసులు శోధిస్తున్నారు.

ఆరు సొసైటీలకు అధికార పీఐసీలు

కొనసాగింపు

ఒంగోలు విద్య, మే 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సొసైటీలు)కు అధికార పర్సన్ ఇన్‌చార్జి కమిటీ(పీఐసీ)ల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సొసైటీలకు పీఐసీల పదవీ కాలాన్ని ఈ ఏడాది అక్టోబరు 30 వరకు పొడిగిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెం పీఐసీగా ఎం.గోపాలకృష్ణ, నాగులుప్పలపాడు మండలం రాపర్ల పీఐసీగా జేబీఎస్.కుమార్, టంగుటూరు మండలం కొణిజేడు పీఐసీగా ఈ.శ్రీనివాసులు, మన్నేపల్లి సొసైటీ పీఐసీగా షేక్‌జిలానీ బాషా, పొన్నలూరు సొసైటీ పీఐసీగా షేక్ చినవలేలమ్మ, టంగుటూరు మండలం కారుమంచి సొసైటీ పీఐసీగా బీసీహెచ్.మాలకొండయ్యలు మరో ఆరు నెలలు ఆ పదవిలో కొనసాగుతారు.

ఇంటర్ విద్యలో బదిలీలకు కసరత్తు

- బోధన, బోధనేతర సిబ్బందికి కౌన్సెలింగ్
- నెలాఖరులోపు కొత్తస్థానాల్లో చేరాలని ఉత్తర్వులు
- ప్రాధాన్యత కేటగిరీకి తాజా ధ్రువీకరణ పత్రాలు
- ఒంగోలు రిమ్స్‌లో మెడికల్ బోర్డు ఏర్పాటు

7


సింగరాయకొండ మండలం ఊళ్లపాలెంలో లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న మంత్రి స్వామి

ఉత్సాహంగా..

జిల్లా అంతటా పెన్షన్ల పంపిణీ

- తొలి రెండు గంటల్లోనే 60శాతం పూర్తి
- సాయంత్రానికి 90 శాతం అందజేత
- ఊళ్లపాలెంలో పాల్గొన్న మంత్రి డాక్టర్ స్వామి
- కొత్తకోటలో జోనల్ స్పెషలాఫీసర్ కృష్ణబాబు హాజరు
- వివిధ ప్రాంతాల్లో నేతలు, అధికారుల భాగస్వామ్యం

ఒంగోలు మే 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం గురువారం ఉత్సాహంగా సాగింది. ఉదయం 7 గంటల నుంచే ప్రారంభం కాగా తొలి రెండు గంటల వ్యవధిలోనే దాదాపు 60శాతం మంది లబ్ధిదారులకు పెన్షన్ మొత్తాలను సిబ్బంది అందజేశారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సామాజిక పెన్షన్ మొత్తాన్ని పెంచడమే కాక ప్రతినెలా 1వ తేదీనే అందిస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి నుంచి గ్రామస్థాయిలోని సచివాలయ సిబ్బంది వరకు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారిని గౌరవంగా పలుకరించి ఆ మొత్తాలను ఇస్తున్నారు. ఈ క్రమంలో మే నెల పెన్షన్ మొత్తాలను గురువారం జిల్లావ్యాప్తంగా పంపిణీ చేశారు. జిల్లాలో ఈ నెలలో మొత్తం 2,82,303 మంది లబ్ధిదారులకు రూ.123.23 కోట్ల మేర అందించాల్సి ఉంది. గతనెల వరకు 2,84,684 మందికి ఇస్తుండగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పెన్షన్లు పొందిన కొందరివి పరిశీలించి రద్దుచేశారు. దీంతో ఈ నెలలో కొంతమేర తగ్గాయి. ఈ నెలలో పంపిణీ చేయాల్సి 2.82లక్షల మందిలో ఉదయం 9గంటలకే లక్షా 69వేల మందికి అందజేశారు. సాయంత్రం నాలుగు గంటల సమయానికి జిల్లాలో దాదాపు 90శాతంతో 2.52 లక్షల మందికి సుమారు రూ.109.35 కోట్ల మేర నగదు పంపిణీ చేశారు. మరికొంత మందికి సాయంత్రం పంపిణీ చేయగా అందుబాటులో లేనివారికి శుక్రవారం ఇవ్వనున్నారు. పెన్షన్ పొందుతున్న భర్త చనిపోయిన మరో 4,362 మంది మహిళలకు ఈ నెలలో ఇవ్వాలని తొలుత ప్రభుత్వం నిర్ణయించిన సకాలంలో దరఖాస్తుల పరిశీలన పూర్తికాక ఇవ్వలేకపోయారు.


నాగులుప్పలపాడు మండలం కొత్తకోటలో పింఛన్లు అందిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు, పక్కన కలెక్టర్ అన్సారియా

పంపిణీలో పాల్గొన్న నేతలు

- సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి సింగరాయకొండ మండలం ఊళ్లపాలెంలో పలువురు లబ్ధిదారుల ఇళ్లకు తిరిగి పెన్షన్లు అందజేశారు.
- ప్రభుత్వం నియమించిన జోన్4 స్పెషల్ ఆఫీసర్ అయిన ప్రభుత్వ స్పెషల్ సీఎస్ ముద్దా తిరుమల కృష్ణబాబు ఎన్‌జీపాడు మండలం కొత్తకోటలో ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి పంపిణీ చేశారు.
- ఒంగోలులోని 47వ డివిజన్‌లో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పింఛన్లు అందించారు.
- కనిగిరి పట్టణం, ఆ మండలంలోని పేరంగుడిపల్లిలో పెన్షన్లు పంపిణీలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొనగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని రామలక్ష్మీకాలనీలో పంపిణీ చేశారు.
- దర్శి పట్టణంలో జరిగిన పెన్షన్ల పంపిణీలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పాల్గొనగా పుల్లలచెరువు మండలం నరజాముల తాండలో టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పంపిణీ చేశారు. పలు ఇతర ప్రాంతాల్లో స్థానిక అధికారపార్టీ నాయకులు, అధికారులు కూడా పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు సంఘీభావం



చర్చిసెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న మాజీసైనికులు

ఒంగోలు(రూరల్), మే1(ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడి మృతి చెందిన పర్యాటకులకు జిల్లా మాజీ సైనికులు సంఘీభావం ప్రకటించారు. గురువారం ఒంగోలులోని చర్చిసెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నెప్పల నాగేశ్వరరావు మాట్లాడుతూ జమ్ముకశ్మీర్‌లో పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాదులును సైన్యం ఏరివేయాలన్నారు. 26మంది పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపడం ఎంత మాత్రం సహించకూడని విషయమని, ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలు సైన్యానికి అండగా ఉండాలన్నారు. మృతి చెందిన పర్యాటకులకు నివాళులర్పించారు. భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆలపాటి వెంకటేశ్వర్లు, పాశం వెంకటరెడ్డి, మండవ వెంకటేశ్వర్లు, తుళ్లూరి వెంకటేశ్వరరావు, బి.వెకంటేశ్వరరావు, చీమకుర్తి సుబ్బారావు, బ్రహ్మయ్య, ఎస్‌బీఐ అంజయ్య, క్యాంటీన్ మేనేజర్ గుమ్మడి వెంకట్రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గెం శ్రీనివాసరావు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

సిమెంట్, ఐరన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న సభ్యులు

ఒంగోలు కార్పొరేషన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర సిమెంట్ అండ్ ఐరన్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ గురువారం ఎన్నికైంది. స్థానిక బైపాస్‌రోడ్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన డీలర్ల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులు నిడమనూరి హనుమంతరావు, ఉపాధ్యక్షులుగా కుంచాల శంకర్, కార్యదర్శిగా సాయన వెంకట్రావు, సంయుక్త కార్యదర్శిగా సోమల ఆనంద్‌బాబు, కోశాధికారిగా బొల్లినేని శ్రీను, కార్యవర్గ సభ్యులుగా పబ్బిశెట్టి గోపి, మట్టా సురేష్, గుంజి మహేంద్ర, దాచర్ల శివయ్య, ఉప్పలపాటి రామచంద్రరాజులను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి గౌరవ అధ్యక్షులుగా తిరుపతిస్వామి, కందుల శ్రీనివాసరావు, అబ్బూరి శ్రీనివాసరావు, అంజయ్య, చాగంటి సుబ్బారెడ్డి వ్యవహరించారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు(రూరల్), మే1(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాజశేఖర్‌రావు కోరారు. గురువారం ఒంగోలు మండలం గుండాయపాలెంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఉదయం ఆరు గంటలకే పనులకు హాజరుకావాలని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం గ్రామంలో పింఛన్లు అందజేశారు. ఏపీవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్‌తో ఆసరా !

● ఎమ్మెల్యే దామచర్ల



47వ డివిజన్‌లో దివ్యాంగురాలికి పింఛను నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, మే 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే వృద్ధులు, దివ్యాంగులు, వితంతవులు, ఒంటరి మహిళల సంక్షేమం సాధ్యపడుతుందని, ఎన్టీఆర్ భరోసా పింఛను వారికి ఎంతో ఆసరా అని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లను గురువారం ఒంగోలు నగరంలోని పంపిణీ చేశారు. స్థానిక 47వ డివిజన్‌లో ఎమ్మెల్యే దామచర్ల లబ్ధిదారులకు పింఛను నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛను లబ్ధిదారులకు భరోసాగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వం హయాంలో రూ.2వేలు నుంచి రూ.3వేలు పింఛను పెంచడానికి నాలుగేళ్లు పట్టిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకం చేసి ఒకేసారి వెయ్యి రూపాయలు పెంచి రూ.4వేలు చేశారన్నారు. అలాగే దివ్యాంగులకు రూ.6వేలు పెంచారని చెప్పారు. ఇది పేదల ప్రభుత్వం అన్నారు. అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా పింఛను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ వేమూరి అశ్విని, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎన్‌పాడులో 94 శాతం..

సంతనూతలపాడు: మండలంలో గురువారం సాయంత్రానికి 94.56 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. రుద్రవరంలో ఆయన పింఛన్లు అందజేసి ఉపాధి పనులను పరిశీలించారు.

అమరావతికి వెళ్లే ప్రజల కోసం అన్ని వసతులు

● కలెక్టర్ అన్సారియా ఆదేశం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునః ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. వారికి అవసరమైన తాత్కాలిక వసతి, అల్పాహారం అందించేందుకు ఒంగోలులోని విష్ణుప్రియ కళ్యాణ మండపం, క్విజ్, రైజ్ కాలేజీల్లో చేస్తున్న ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి ఆమె గురువారం రాత్రి పరిశీలించారు. అన్నమయ్య జిల్లా నుంచి 30 బస్సుల్లో 1500మంది, కడప నుంచి 70 బస్సుల్లో 3వేల మంది, తిరుపతి నుంచి 70 బస్సుల్లో 3వేల మంది అమరావతికి వెళుతున్నందున శుక్రవారం తెల్లవారుజామున ఒంగోలుకు చేరుకుంటారని కలెక్టర్ తెలిపారు. కొంత విశ్రాంతి అనంతరం అల్పాహారం తిని అమరావతికి మరలా బయలుదేరి వెళ్తారని చెప్పారు. ఇక ఒంగోలు మండలం నుంచి 2500 మంది, కొత్తపట్నం నుంచి 500 మంది 60 బస్సుల్లో వెళ్తారని కలెక్టర్ వెల్లడించారు. వీరి కోసం స్థానిక మినీస్టేడియంలో బస్సులను, అల్పాహారం ఏర్పాట్లను జిల్లా అధికారులు చేశారు. అల్పాహారంలో పులిహోర, అరటిపండు, వాటర్‌బాటిల్స్ రెండు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రణాళిక ప్రకారం సకాలంలో బస్సులు బయలు దేరి వెళ్ళేలా చూడాలని ఆర్డీవో లక్ష్మీప్రసన్న, అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట పలు శాఖల అధికారులు ఉన్నారు.

చీమకుర్తి వాకర్స్ కార్యవర్గం ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన పాలకవర్గం

చీమకుర్తి, మే1(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తిలో వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా ధనేకుల రమణయ్య, కార్యదర్శిగా ఎస్.అంజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్‌కే.ఖాదర్‌వలి, జి.శ్రీనివాసరావు, నారాయణరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా బుడిసా, చంద్రమౌళి, ఎస్‌కే.షరీఫ్, కోశాధికారిగా గోగినేని సుధాకర్, గౌరవ సలహాదారునిగా సుభానీలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం చేత వెల్లంపల్లి రంగారావు ప్రమాణం చేయించారు. కార్యవర్గాన్ని అభినందించారు.

వైద్య విద్యార్థి యగ్నేష్‌కు కన్నీటి వీడ్కోలు

ఒంగోలు కార్పొరేషన్, మే 1 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో మరణించిన ఒంగోలుకు చెందిన వైద్య విద్యార్థి గుర్రం యగ్నేష్ అంత్యక్రియలు గురువారం నగరంలో జరిగాయి. స్థానిక భాగ్యనగర్ 3వలైనులోని ఆరో అడ్డరోడ్డులో నివసించే యగ్నేష్ నెల్లూరులోని నారాయణ మెడికల్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా బుధవారం తన స్నేహితుడు చక్రధర్ సోదరి నిశ్చితార్థానికి వెళ్ళి వస్తూ ప్రమాదవశాత్తు జరిగిన కారు ప్రమాదంలో యగ్నేష్ మృతి చెందాడు. ఈ సందర్భంగా బంధువులు, కాలేజీ సిబ్బంది, స్థానికులు పెద్ద సంఖ్యలో విచ్చేసి నివాళులర్పించారు. ఇంటికి పెద్ద కొడుకు అయిన యగ్నేష్ చిన్న వయసులోనే మరణించడంతో వారి కుటుంబం, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. మరో రెండేళ్ళలో చదువు పూర్తి చేసుకుని డాక్టర్ అవుతాడని ఆశపడిన తల్లిదండ్రులను ఓదార్చడం అక్కడున్నవారికి సాధ్యపడలేదు. అనంతరం యగ్నేష్ అంతిమయాత్ర నిర్వహించి స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలోని హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

కులగణనపై మోదీ సర్కార్ చారిత్రాత్మక నిర్ణయం



మాట్లాడుతున్న సురేష్

ఒంగోలు కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి): జనాభా లెక్కల్లో కుల గణనను చేర్చాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకున్నారని బీజేపీ ఓబీసీ జిల్లా మోర్చా అధ్యక్షుడు తానికొండ సురేష్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 94 సంవత్సరాలుగా జనాభా లెక్కల్లో కుల గణన జరగలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల సామాజిక న్యాయానికి, పారదర్శక పాలనకు దారి తీయనుందని తెలిపారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ కులగణనపై పదేపదే హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందే తప్ప పట్టించుకున్న పరిస్థితి లేకుండా పోయిందని విమర్శించారు. జిల్లా జనరల్ సెక్రటరీ దండు శ్రీనివాసరావు మాట్లాడుతూ మోదీ నిర్ణయం వల్ల సామాజికంగా వెనుకబడిన తరగతుల జీవితాల్లో సానుకూల మార్పులకు నాంది పలికే మార్గం సులభతరమైందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దామచర్లకు సత్కారం



ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి): ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు గురువారం ఒంగోలులో దామచర్ల జనార్దన్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌వీ.కృష్ణ, పి.అంకబాబు నూతన కమిటీ సభ్యులను పరిచయం చేశారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్లను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ట్రెజరీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. అనంతరం ట్రెజరీ అధికారి జగన్నాథరావును నూతన కమిటి సభ్యులు కలిశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వరకుమార్, కె.రామకృష్ణ, కె.లావణ్య, బి.అక్కేశ్వరరావు, ఎస్‌కే.కరీముల్లా, కె.వెంకటేశ్వర్లు, పి.హేమలత, కె.ప్రసాద్ చంద్ర, డి.అనిల్, సీహెచ్.ఫణీంద్ర, కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో వాలీబాల్ శిక్షణ శిబిరం



శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులు

కొత్తపట్నం, మే 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో అల్లూరులో గురువారం వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. నెల రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని గ్రామ పెద్ద ఏసోబు ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం ఈ శిక్షణ జరగనుంది. క్రీడాకారులకు అల్పాహారంతో పాటు క్రీడా సామగ్రిని కూడా అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేసవి శిక్షణా శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు, శిక్షకులు దాసరి పోలయ్య పాల్గొన్నారు.

దేశ అభివృద్ధికి విద్య, విజ్ఞానం కీలకం

మద్దిపాడు, మే 1(ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధికి విద్య, విజ్ఞానం కీలకమని ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) అన్నారు. గురువారం మారెళ్లగుంటపాలెంలోని ఆసరా ఆశ్రమంలో 9,10 తరగతుల విద్యార్థులకు వేసవి శిక్షణ కార్యక్రమం అధ్యక్షుడు చిడిపోతు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే విద్య అత్యంత ప్రధానమైనదని, ఇంగ్లీషులో మాట్లాడటం, రాయటం బాగా నేర్చినప్పుడే కార్పొరేట్ సంస్థలు ఉద్యోగాలు ఇస్తాయన్నారు. ఆసరా ప్రారంభించిన శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పొత్తూరు నారాయణ, కోశాధికారి సింగయ్య, కేవీవీ.ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ఆదినారాయణ, చంద్రమౌళిలు ఇంగ్లీష్, లెక్కలు తరగతులు నిర్వహించారు.

అమరావతి రీస్టార్ట్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్

మద్దిపాడు, మే 1(ఆంధ్రజ్యోతి): అమరావతిలో శుక్రవారం జరిగే రాజధాని పునఃప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో ఎంపీడీవో ప్రసాద్ అధ్యతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్దిపాడు నుంచి అమరావతికి వెళ్లేందుకు ప్రభుత్వం బస్సులు ఏర్పాటు చేసిందని, ఉదయం 8 గంటలకు బయలుదేరతాయని చెప్పారు. సమావేశంలో డీటీ బీ.అజయ్‌కుమార్‌రెడ్డి, ఏపీఎం సుబ్బారావు, ఏపీవో ధనుంజయ్‌వర్మ, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కులగణన పట్ల ప్రధానికి కృతజ్ఞతలు

మద్దిపాడు, మే 1(ఆంధ్రజ్యోతి): దేశంలో కులగణనకు అంగీకరిస్తూ ప్రధాని నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయం అభినందనీయమని ఓబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.వీరభద్రాచారి పేర్కొన్నారు. గురువారం మద్దిపాడులో ఆయన మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా బీసీ సంఘాలు చేసిన పోరాటాలను గుర్తించిన ప్రధాని తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు.



ఒంగోలులో ఏఐటీయూసీ నాయకుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు



చీమకుర్తిలో జరిగిన ర్యాలీలో భారీగా పాల్గొన్న కార్మికులు

ఘనంగా కార్మికుల దినోత్సవం

● వాడవాడలా ఎర్రజెండాల రెపరెపలు

● పలుచోట్ల ర్యాలీలు, సభలు

ఒంగోలు కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి): మేడే వేడుకలు ఒంగోలు నగరంలో పలు కార్మిక సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు.

- వైసీపీ కార్యాలయంలో జరిగిన మేడే వేడుకల్లో ట్రేడ్ యూనియన్ నాయకుడు ఎం.గురవయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాదాసి వెంకయ్య, కటారి శంకర్, బొట్లా సుబ్బారావు పాల్గొన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు వైవీ.సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు.

- స్థానిక సుందరయ్య భవన్‌లో మేడే జెండాను సీనియర్ నాయకుడు వై.సిద్ధయ్య ఆవిష్కరించారు. అలాగే పుచ్చలపల్లి సుందరయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు నివాళులర్పించారు. కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, బి.రఘురాం, కంకణల రమాదేవి, పి.కల్పన, నరసయ్య, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

- సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే సందర్భంగా పని ప్రదేశాల్లో జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయం నుంచి అద్దంకి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, జి.ఆదిలక్ష్మి, మారెళ్ళ సుబ్బారావు, భక్తసింగ్ రాజు, జి.రమేష్ తదితరులు ఉన్నారు.

- సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఈ మనిపాలెంలో నిర్వహించారు. కార్యక్రమంలో వీకే.రాజేశ్వరి, ఎస్.లలితకుమారి, విజయసారథి, పరిటాల కోటేశ్వరరావు, డాక్టర్ జీవీ.కృష్ణయ్య పాల్గొన్నారు.

- భారత కార్మిక సంఘాల సమాఖ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీల ఆధ్వర్యంలో పలుచోట్ల జెండాను ఎగురవేశారు. కలెక్టరేట్ ఎదుట అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కళా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో చిట్టిపాటి వెంకటేశ్వర్లు, బి.పద్మ, జాలన్న, నారాయణ, మోజేష్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక కలెక్టరేట్ ఎదుట ఉన్న మంచి పుస్తకం కార్యాలయం వద్ద జరిగిన మేడేలో కత్తి కళ్యాణ్, చుండూరి రంగారావు, చావలి సుధాకర్‌రావు, బి.సుబ్బారావు, గుంటూరు మస్తాన్‌రావు, మిరియం అంజిబాబు, మంచికంటి వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

- స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద మేడే సందర్భంగా గురువారం ప్రముఖ న్యాయవాది ముదవర్తి రాఘవరావుతో కలిసి జెండాను జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ ఆవిష్కరించారు. పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులను 28 మందిని అత్యంత పాశవికంగా కాల్చిచంపడం దుర్మార్గంగా ఉందన్నారు. అనంతరం ర్యాలీలు నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ ముఠా కార్మిక సంఘం కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కె.వెంకటేశ్వర్లు, శ్రీరామ్ శ్రీనివాస్, యు.ప్రకాశరావు, నాగేశ్వరరావు, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు మండలంలో..

ఒంగోలు(రూరల్): కరవది గ్రామంలో జిల్లా రైతు సంఘ నాయకుడు వి.హనుమారెడ్డి ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి. సీపీఐ నాయకులు పోలవరపు సీతారామయ్య, రవి, జయరావు, ప్రభుదాసు పాల్గొన్నారు.

ఒంగోలులోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సయ్యద్‌రహమాన్, కేశవరావు, పారా శ్రీనివాసరావు, పి.ఆంజనేయులు, రాంబాబు పాల్గొన్నారు

చీమకుర్తిలో భారీ ర్యాలీ

చీమకుర్తి: మేడే సందర్భంగా చీమకుర్తిలో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, బి.వీరాంజనేయులు, పల్లాపల్లి ఆంజనేయులు, పూసపాటి వెంకట్రావు ఓబులేషు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: మండల పరిధిలోని పెద్దకొత్తపల్లి, మారెళ్లగుంటపాలెం, నర్సాయపాలెం, అంజయ్యనగర్ తదితర గ్రామాల్లో గురువారం కార్మిక దినోత్సవం సందర్భంగా సీపీఐ జెండాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీవీ.ప్రసాద్, నల్లూరి రామారావు, నలబోతు శ్రీనివాసరావు, అంగలకుర్తి వెంకట్రావు, మద్దులూరి అంజయ్య, బండి కోటిరెడ్డి, నాతాని కోటిలింగం, పూనూరి లేవి, నల్లజర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు): స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద టీఎన్‌టీయూసీ జెండాను యూనియన్ ఉపాధ్యక్షులు చెరుకూరి వెంకటసుబ్బయ్య ఆవిష్కరించారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్, ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, టీఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు మందాడి వెంకటేశ్వర్లు, ఆర్.వి.సురేష్‌బాబు, ఎం.శ్రీనివాసరావు, బి.శంకర్, ఎస్.శ్రీరామ్మూర్తి, అంకమశెట్టి, పీఎన్ఎస్.చౌదరి, ఆర్.అంకారావు, కె.పద్మ, వంశీ, మాధవరావు, పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పేర్నమిట్ట, మంగమూరు, మైనంపాడు, ఎండ్లూరులో మేడే నిర్వహించారు.



మైనంపాడులో..

నాగులుప్పలపాడు మండలంలో..


నాగులుప్పలపాడు: మండలంలోని బి.నిడమానూరు, మట్టిగుంట, నాగులుప్పలపాడు, ఒమ్మెవరం, కనపర్తి, చదలవాడ, ఉప్పుగుండూరు తదితర గ్రామాల్లో మేడేను నిర్వహించారు. ఉప్పుగుండూరు బస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ నాయకులు తూబాటి శ్రీకాంత్, పోలేరమ్మ గుడి వద్ద పాలపర్తి బాబు జెండాను ఎగురవేశారు. కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జె.జయంతిబాబు, ఎస్.రామారావు పాల్గొన్నారు.

కొత్తపట్నంలో..

కొత్తపట్నం: మేడేను కొత్తపట్నంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్‌సెంటర్లో జెండాను ఆవిష్కరించిన సీపీఐ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కిష్టం పిచ్చయ్య, ఆర్.వెంకటరావు, విజయ, శ్రీహరి, రామకృష్ణ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకే ప్రాధాన్యం

● కమ్మవారి సేవాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ



మురళీకృష్ణను సన్మానిస్తున్న సంఘ కార్యవర్గం, ప్రముఖులు

ఒంగోలు (కల్చరల్), మే 1(ఆంధ్రజ్యోతి) : సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన పేదలకు అండగా నిలిచేవిధంగా సేవా కార్యక్రమాలకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తానని ఆంధ్రప్రదేశ్ కమ్మవారి సేవాసమాఖ్య నూతన రాష్ట్ర అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ పేర్కొన్నారు. సమాఖ్య అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా గురువారం ఒంగోలు నగరం నిర్మల్‌నగర్‌లోని ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘ కార్యాలయంలో కార్యవర్గ సభ్యులు, ఇతర ప్రముఖులు ఆయనను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, స్పోర్ట్స్, ఉపాధి మొదలైన రంగాలలో కమ్మవారితో పాటు ఇతర కులాలలో వివిధ రంగాల్లో రాణిస్తున్న పేదలకు సైతం సహాయం చేయటం తమ లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని అన్ని సంఘాలను కలుపుకుని రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామని చెప్పారు. రిటైర్డ్ డీజీ ఏబీ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 12 హాస్టళ్లు ప్రస్తుతం నడుస్తున్నాయని, మరిన్ని హాస్టళ్ల ఏర్పాటుకు తమ ట్రస్ట్ తరఫున కృషిచేస్తామని తెలిపారు. ఆలా హనుమంత రావు మాట్లాడుతూ జిల్లాకు చెందిన మురళీకృష్ణ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నిక కావటం అభినందనీయమన్నారు. డాక్టర్ కె.సీతారామయ్య మాట్లాడుతూ రాబోయేకాలంలో సంఘం తరఫున మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో చిడిపోతు వెంకటేశ్వర్లు, కాట్రగడ్డ రఘుపతిరావు, అబ్బూరి నవీన్‌కుమార్, బాపయ్యచౌదరి, రావుల పద్మజ, మహిళా విభాగం అధ్యక్షురాలు వడ్డెంపూడి సుజాత, భాస్కరరావు, కంచర్ల నారాయణ, మోటుపల్లి చౌదరి, యువజన విభాగం అధ్యక్షుడు బొడ్డపాటి వెంకట్, కరిచేటి చంద్రశేఖర్‌రావు, అంగలకుర్తి నరసింహం తదితరులు పాల్గొన్నారు.

4న నాయీబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయవేదిక

ఒంగోలు కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి) : నాయీబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమం ఈనెల 4వతేదీన ఒంగోలులోని పద్మావతి ఫంక్షన్‌హాలులో నిర్వహిస్తున్నట్లు వేదిక కార్యదర్శి నాదెండ్ల రాఘవరావు తెలిపారు. గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివాహ పరిచయ వేదికకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి నాయిబ్రాహ్మణులు పాల్గొంటుండటంతో అందుకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని నాయిబ్రాహ్మణ కుటుంబ సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.మధుబాబు, వేదిక అధ్యక్షుడు పాతపాటి మధు, ఎం.వెంకటరావు, గుంటూరు ఆదెయ్య, సురేష్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం

- రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబు
- మద్దిపాడు, ఎన్‌జీపాడు మండలాల్లో విస్తృత పర్యటన
- హాజరైన కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే బీఎన్


ప్రజలతో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబు, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే బీఎన్

నాగులుప్పలపాడు, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నట్లు వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు చెప్పారు. గురువారం మద్దిపాడు, ఎన్‌జీపాడు మండలాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కొత్తకోట గ్రామంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌తో కలిసి ఆయన లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు. లబ్ధిదారుల కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా వైద్యం అందించేలా ప్రభుత్వ వైద్యశాలలను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు, 104, అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై అడిగి తెలుసుకొన్నారు. స్థానిక పాఠశాలలో డ్వాక్రా గ్రూపు మహిళలతో సమావేశమై పలు సూచనలు చేశారు. బి.నిడమానూరు గ్రామంలో ప్రభుత్వ వైద్యశాల ఏర్పాటు చేయాలని పలువురు గ్రామస్థులు అర్జీ అందజేశారు. కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ టి.నారాయణ, ఏసీ విజయమ్మ, డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వై.మహాలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, మండల ప్రధాన కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, నాయకులు గుమ్మడి సాయిబాబా, ఎంపీటీసీ వై.సుబాషిణి, నాయకులు కోనూరి ఆంజనేయులు పాల్గొన్నారు.

వైద్యశాలల్లో మందుల కొరత లేకుండా చర్యలు

మద్దిపాడు: ప్రభుత్వ వైద్యశాలల్లో మందులకు కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు చెప్పారు. గురువారం మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం, మల్లవరం రిజర్వాయర్, మద్దిపాడులోని పీహెచ్‌సీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు వైద్యులకు దిశా నిర్దేశం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన ఆరోగ్య సేవలు నిర్ధారించడంలో వైద్యులు కీలక పాత్రపోషించాలని చెప్పారు. వైద్య సేవలపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, శిశువులలో రక్తహీనత పరిస్థితులపై వైద్యులు దృష్టిపెట్టేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లును ఆదేశించారు. అదేవిధంగా గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో గ్రానైట్ ఎగుమతుల వివరాలను, గుండ్లకమ్మ రిజర్వాయర్ దగ్గర మత్స్యకారులతో మాట్లాడి వారి సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారులు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్ అన్సారియాకు సూచించారు.

అనంతరం మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, ఎంపీడీవో వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా జిల్లా అభివృద్ధికి పాటుపడాలి

జోనల్ ఇన్‌చార్జి ఎంటీ కృష్ణబాబు

ఒంగోలు కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆకాంక్షలు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా జిల్లాను అభివృద్ధి చేయడంపై అన్నిశాఖల అధికారులు దృష్టి పెట్టాలని వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్‌చీఫ్ సెక్రటరి, జోనల్ ఇన్‌చార్జి ఎంటీ కృష్ణబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో గురువారం సాయంత్రం అన్నిశాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు జిల్లాలో అమలవుతున్న తీరు, వాటి పురోగతిపై దిశా నిర్దేశం చేశారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణలు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆయా శాఖల వారీగా సాధించిన పురోగతిని వివరించారు. అనంతరం ఆయా శాఖలపై సమీక్షించిన కృష్ణబాబు వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా సరఫరా చేయడంతో పాటు నీటి నాణ్యత కూడా ముఖ్యమన్నారు. సమావేశంలో డీఆర్వో చిన్న ఓబులేషు, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రినాగ్, సీపీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబు, కలెక్టర్ అన్సారియా, జేసీలు గోపాలకృష్ణ, త్రివినాగ్

ఎట్టకేలకు టీచర్ల పునర్విభజన పూర్తి

ఒంగోలు విద్య, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల పునర్విభజన ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. బుధవారం రాత్రాంతా పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయంలో కుస్తీలు పట్టి ఆ ప్రక్రియను ముగించారు. టీచర్ల పునర్విభజన వివరాలను గురువారం కమిషనర్ కార్యాలయంలో సమర్పించగా ఆమోదం తెలిపారు. జిల్లాలో టీచర్ల పునర్విభజనకు సంబంధించి పెద్ద కసరత్తు జరిగింది. చివరగా ప్రతిపాదనలు సమర్పించేందుకు డీఈవో కిరణ్ కుమార్, ఎంఈవోలు తదితరులు అమరావతిలో ఉండి విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ ఏవీ సుబ్బారెడ్డి పర్యవేక్షణలో టీచర్ల పునర్విభజన ప్రక్రియను పూర్తి చేశారు. పాఠశాల విద్యా కమిషనర్ బుధవారం రాత్రి 10 గంటలకు డీఈవోలు, ఆర్‌జేడీలతో మాట్లాడి ఎంత పొద్దుపోయినాసరే రాత్రికి పునర్విభజన పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో డీఈవో కిరణ్‌కుమార్ బృందం గురువారం ఉదయానికి ఆ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ విషయంపై డీఈవో స్పందిస్తూ టీచర్ల పునర్విభజనకు సంబంధించి అన్ని వివరాలు కమిషనర్ కార్యాలయంలో సమర్పించగా ఆమోదించారని చెప్పారు.

కనులపండువగా రథోత్సవం


వేంకటేశ్వరస్వామి రథోత్సవం

కంభం, మే 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 10వ రోజు బుధవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం కనులపండువగా జరిగింది. స్వామి వారి రథోత్సవంలో కోలాటాలు, కేరళ నృత్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించింది. మాడవీదుల్లో ఊరేగుతున్న స్వామి వారికి కాయకర్పూరాలను భక్తులు సమర్పించారు.

వీరయ్య కుటుంబసభ్యులకు పరిటాల పరామర్శ


వీరయ్యచౌదరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

నాగులుప్పలపాడు, మే 1 (ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి కుటుంబ సభ్యులను గురువారం బాపట్ల ఎంపీ తేనేటి కృష్ణప్రసాద్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పరామర్శించారు. అమ్మనబ్రోలులోని వీరయ్యచౌదరి నివాసంలో ఆయన సతీమణి సుచిత్ర, కుమారుడు చంద్రసిద్ధార్థతో వారు మాట్లాడారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. నిబద్ధత గల నాయకుడిని పార్టీ కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. వీరయ్య చిత్రపటానికి ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే పరిటాల సునీత పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

కస్తూర్బాలో అదనపు గదులకు ఎమ్మెల్యే కందుల భూమి పూజ


కస్తూర్బాలో అదనపు భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కందుల

పొదిలి, మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని కస్తూర్బా పాఠశాలలో కోటి 49 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే గురువారం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం నాలుగు కోట్ల రూపాయలు కస్తూర్బా పాఠశాలల్లో అవసరమైన గదుల నిర్మాణానికి మంజూరయ్యాయన్నారు. పొదిలి, గొట్లగట్టు, కలుజువ్వలపాడు, వెలిగొండ గురుకుల పాఠశాలలకు వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుత్తా శోభన్‌బాబు, నగరపంచాయతీ కమిషనర్ నారాయణరెడ్డి, ఎంఈవో ఎం శ్రీనివాసరెడ్డి, కేజీబీవీ హెచ్‌ఎం అనురాధ పాల్గొన్నారు.

చలివేంద్ర ప్రారంభం : టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాధవి ఆధ్వర్యంలో పొదిలి పెద్దబస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన 24 గంటల కూలింగ్ తాగునీటి చలివేంద్రాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండలు మండుతున్న సమయంలో ప్రజల దాహార్తిని తీరుస్తున్న గునుపూడిని అభినందించారు.

రెండో రోజూ కొనసాగిన సమ్మె

ఒంగోలు కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ఒక నిర్దిష్టమైన పనిలేకుండా రకరకాల పనులు చేయిస్తూ మరింత పనిభారం పెంచుతున్నారని ఆరోపించారు. ఆరు సంవత్సరాలు పనిచేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని, ఎన్‌ఎంహెచ్ ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్ ఇచ్చి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎం.రాజేష్, ప్రసన్న, సయ్యద్‌గౌస్, జీవన జ్యోతి పాల్గొన్నారు.

దేశంలోకెల్లా పింఛన్లు రాష్ట్రంలోనే అధికం

- ఇక్కడే అధిక మొత్తం లబ్ధి
- ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలనూ అమలుచేస్తాం
- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి
- ఊళ్లపాలెంలో పింఛన్ల పంపిణీ
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం


హాస్టల్‌లో జరుగుతున్న మరమ్మతులను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ, మే 1 (ఆంధ్రజ్యోతి) : దేశంలోకెల్లా అధిక మొత్తంలో సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేస్తున్న రాష్ట్రం ఏపీ ఒక్కటేనని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. మండలంలోని ఊళ్లపాలెంలో గురువారం ఎన్టీఆర్ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇంటికి నేరుగా వెళ్లి పెన్షన్ సొమ్మును అందజేశారు. అనంతరం ఊళ్లపాలెం తీరంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ 10 నెలల పాలనలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నేరవేరుస్తామని హామీ ఇచ్చారు. పింఛన్‌ను 200 నుంచి రూ. 2వేలకు, ఆ తరువాత ఎన్నికల హామీలో భాగంగా రూ. 4వేలు ఇస్తున్న ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. ఎస్సీ, బీసీలకు ఇంటి నిర్మాణాలకు రూ. 3లక్షలు, ఎస్టీలకు రూ. 3.5 లక్షలు ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు. ఆక్వారైతులకు యూనిట్ విద్యుత్‌ను రూ. 1.50పై సబ్సిడీపై ఇస్తున్నామని చెప్పారు. సముద్రతీరంలోకి అక్రమంగా చొరబడి ఇక్కడి మత్స్యసంపదను కొల్లగొడుతున్న చైన్నెకి చెందిన సోనాబోట్ల వివరాలను అక్కడ ప్రభుత్వానికి పంపిస్తే కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఆ బోట్ల కట్టడికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అమరావతిలో నూతన అధ్యాయం ప్రారంభమవుతుందన్నారు. శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ చేతులమీదగా వేలకోట్ల రూపాయల విలువైన పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ రవి, ఎంపీడీవో జయమణి, మత్స్యశాఖ ఏఈ వర్షిణి, టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, కూనపరెడ్డి సుబ్బారావు, మించల బ్రహ్మయ్య, సుదర్శి చంటి, గాలి హరిబాబు, బాయిరెడ్డి మురళి, కానాల బాలాజీ, చైతన్య, చిగురుపాటి గిరి, పామర్తి మాధవరావు పాల్గొన్నారు. అనంతరం ఎస్సీ బాలురవసతి గృహంలో మరమ్మతులకు ఇటీవల మంత్రి స్వామి రూ. 10 లక్షల నిధులు కేటాయించారు. దీంతో హాస్టల్లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు.

ఇంటర్ విద్యలో బదిలీలకు కసరత్తు

- బోధన, బోధనేతర సిబ్బందికి కౌన్సెలింగ్
- నెలాఖరులోపు కొత్తస్థానాల్లో చేరాలని ఉత్తర్వులు
- ప్రాధాన్యతా కేటగిరీకి తాజా ధ్రువీకరణ పత్రాలు
- ఒంగోలు రిమ్స్‌లో మెడికల్ బోర్డు ఏర్పాటు



ఒంగోలు విద్య, మే 1 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలు పునఃప్రారంభమయ్యేలోపు బోధన సిబ్బంది సాధారణ బదిలీలు పూర్తిచేసేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు కసరత్తు ప్రారంభించారు. బదిలీల ప్రక్రియ పూర్తై మే 31లోపు వారు కొత్తస్థానాల్లో చేరేలా షెడ్యూల్‌ను రూపొందిస్తున్నారు. దీనికోసం ముందస్తు చర్యల కోసం ఇంటర్ విద్యా డైరెక్టర్ కృతికా శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరీల్లో బదిలీలు పొందేందుకు ముందుగా సంబంధిత వైద్య ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఒంగోలు రిమ్స్‌లో మెడికల్ బోర్డు ఏర్పాటు చేస్తారు.

ప్రాధాన్యతా కేటగిరీ వీరికే

ప్రాణాంతక వ్యాధుధుధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ చికిత్స పొందుతున్న స్పౌజ్, ఆధారపడిన పిల్లలు ఉన్న వారిని ప్రాధాన్యత కేటగిరీలో గుర్తించి వారికి ఆ కేటగిరి కింద బదిలీ చేస్తారు. వ్యాధి తీవ్రత తక్కువ ఉన్నవారికి ప్రత్యేక పాయింట్లు కేటాయిస్తారు. క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, మేజర్ న్యూరో సర్జరీ, బోన్, టీబీ, కిడ్నీ మార్పిడి, డయాలసిస్, అవయవ మార్పిడి, స్పైనల్ సర్జరీ చేయించుకున్న వారికి ప్రాధాన్యత కేటగిరీగా గుర్తిస్తారు. మానసిక వ్యాధులతో బాధపడుతూ చికిత్స పొందుతున్న పిల్లలు లేదా స్పౌజ్, తలసేమియా, హిమోఫిలియా, కండరాల క్షీణత గుండెలో రంధ్రం ఉన్న పిల్లలు, గత మూడేళ్లుగా చికిత్స పొందుతూ సర్జరీ చేయించుకున్న వారు ఉంటే వారికి ప్రాధాన్యత కేటగిరీలో గుర్తిస్తారు. అటువంటి వారందరూ మెడికల్‌బోర్డులో ధ్రువీకరణ పత్రాలు తీసుకొని బదిలీల కోసం సమర్పించాల్సి ఉంటుంది.

బదిలీలు ఇలా...

- జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాల్స్, జూనియర్ లెక్చరర్లు, బోధనేతరసిబ్బంది బదిలీల పరిధిలోకి వస్తారు.
- ఒకే స్థానంలో ఐదేళ్లకుపైగా పనిచేస్తున్నవారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. ఒకవేళ వీరు దరఖాస్తు చేసుకోకపోయినా బదిలీల్లో వారు పనిచేస్తున్న స్థానాన్ని ఖాళీగా ప్రకటిస్తారు.
- బదిలీల్లో అందరు కోరుకోగా మిగిలిన స్థానాన్ని ఐదేళ్ల కాలం పూర్తి చేసుకున్న వారికి కేటాయిస్తారు.
- రెండేళ్లు ఒకే స్థానంలో పనిచేసిన వారు అభ్యర్థన మేరకు బదిలీ కోసం దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులు.

ఇంటికి గ్రహదోషం పూజ పేరుతో మోసం

దీక్షధారుల వేషంలో వచ్చి బురిడీ..తీర్థంలో మత్తుమందు ఇచ్చి దోపిడీ

ఒంగోలు క్రైం, మే 1(ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారి స్వామి దీక్ష డ్రస్‌లు ధరించి ఇరువురు వ్యక్తులు చందాల కోసం వచ్చి భార్యాభర్తలకు మత్తు మందు ఇచ్చి దోపిడీకి పాల్పడ్డారు. ఈ సంఘటన స్థానిక చైతన్యనగర్‌లో గురువారం మధ్యాహ్నం జరిగింది. కూలి చేసుకొనే భూమిరెడ్డి గురుస్వామిరెడ్డి అతని భార్య ప్రసన్న ఇంటిలో ఉండగా ఇరువురు వ్యక్తులు మోపెడ్‌పై కాషాయి వస్త్రాలు ధరించి వచ్చారు. భోజనాలకు చందాల పేరుతో ఆ ప్రాంతమంతా తిరిగి గురుస్వామి రెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ గురుస్వామిరెడ్డి భార్య రూ.100 ఇచ్చారు. మీ ఇంటికి గ్రహదోషం ఉంది పూజ చేయాలని నమ్మబలికారు. అందుకు రూ.30 వేలు ఖర్చవుతుందన్నారు. గురుస్వామి రెడ్డి రూ.20 వేలు ఇస్తానని చెప్పి పూజ చేయించాడు. ఆ సమయంలో ఆయన భార్య చెవి కమ్మలు, చేతి ఉంగరం పూజలో ఉంచాలని చెప్పి దేవుడు పటం ముందు పెట్టించారు. పూజ చేసే సమయంలో భార్య భర్తలకు తీర్థం ఇచ్చారు. అది తాగిన తరువాత కొద్ది సేపటికి ఇరువురు మత్తులోకి వెళ్లారు. ఆ తర్వాత వారు ఆమె మెడలో ఉన్న బంగారం గొలుసు, ఉంగరం, చెవికమ్మలుతోపాటు రూ.20 వేలు నగదు తీసుకొని పరారయ్యారు. భార్యాభర్తలు మత్తునుంచి తేరుకొని తాము మోసపోయామని తెలుసుకొని తాలూకా పోలీసు లకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వారి ఇంటి దగ్గరలో ఉన్న సీసీ ఫుటేజిని పరిశీలించార. వారు ప్రయాణించిన వాహనాన్ని గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనాథ పిల్లల సంరక్షణకు చర్యలు

- 'అమ్మా నిద్రలేమ్మా' కథనానికి మంత్రి, కలెక్టర్ స్పందన


అనాథలైన చిన్నారులను పరామర్శిస్తున్న అధికారులు

మర్రిపూడి, మే 1 (ఆంధ్రజ్యోతి) తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల దుస్థితిపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'అమ్మా.. నిద్రలేమ్మా' కథనానికి మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పందించారు. వారి ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ అధికారి శ్రీలక్ష్మీ, కొండెపి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి మాధవీలత గురువారం స్థానిక ఎస్సీకాలనీలో తల్లిదండ్రులను కోల్పోయిన అరవింద్, మేషక్, రూపికలను పరామర్శించారు. రెండేళ్ల వ్యవధిలో తల్లిదండ్రులు ఇద్దరు అనారోగ్య కారణంగా మృత్యువాతపడటం బాధాకరమన్నారు. చిన్నారుల సమీప బంధువులతో కాలనీ పెద్దలతో వారు మాట్లాడారు. చిన్నారులకు అవసరమైన విద్య, వసతి సౌకర్యాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. వాత్సల్యా పథకం కింద చిన్నారులను ఆదుకునేందకు ప్రభుత్వానికి పంపుతామన్నారు. వారి వెంట అంగన్వాడీ సూపర్‌వైజర్ సుచరిత, ఉన్నారు.

మూడు అంశాలపై ఎన్నికల కమిషన్ దృష్టి

ఒంగోలు కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితాల ఖచ్చిత్వం పెంపుపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. ఈ విషయంలో ప్రధానంగా మూడు అంశాలపై చర్యలు చేపట్టింది. ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లకుండా ఉండేందుకు మరణించిన వారి ఓట్లను జాబితాల నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంది. రిజస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నుంచి మరణించిన వారి వివరాలు ఎప్పటికప్పుడు తీసుకుంటూ ఓటర్ల జాబితాలు సవరణలు జరిగినప్పుడు జిల్లాలో మరణించిన వారి పేర్లను జాబితాల నుంచి తొలగించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఓటర్లకు జారీ చేస్తున్న స్లిప్పులు కూడా మార్పులు చేపట్టింది. ఓటరు సీరియల్ నెంబరు, పోలింగ్ కేంద్రం నెంబరు ప్రముఖంగా కనిపించేలా ఓటరు స్లిప్పులను తయారు చేయాలని ఆదేశించింది. ఓటరుకు తన సీరియల్ నెంబరు, పోలింగ్ కేంద్రం నెంబరు తెలిసేలా పెద్ద అక్షరాల్లో ముద్రించాలని ఆదేశించింది.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందుల



నరజాముల తాండాలో పింఛన్ అందజేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

మార్కాపురం, మే 1 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. రాజ్యలక్ష్మి కాలనీలో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారునికి పింఛన్‌ను ఎమ్మెల్యే నారాయణరెడ్డి అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రతి నెలా 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ప్రభుత్వం అందిస్తోందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, తలసీమియా, మూత్రపిండాల వ్యాధిగ్రస్తులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గతం కంటే ఎక్కువగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సొంత డబ్బుతో మూడో నెల పింఛన్ అందజేత

కంభం, మే 1 (ఆంధ్రజ్యోతి) : వరుసగా మూడో నెల కూడా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తన సొంత నగదును పింఛన్‌గా అందజేశారు. తనకు అన్ని అర్హతలున్నా పింఛన్ రావడం లేదని, తనకు పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని కోరుతూ ఫిబ్రవరి 12న జరిగిన మీకోసంలో రాచపూటి కృష్ణ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని కోరగా స్పందించిన ఆయన పింఛన్ మంజూరయ్యే వరకూ తన సొంత నగదు రూ.4వేలు పింఛన్‌గా అందజేస్తానని ప్రకటించారు. మార్చి, ఏప్రిల్, మేలో వరుసగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సొంత నగదును కృష్ణకు టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు తోట వెంకట శ్రీనివాసుల ద్వారా అందచేస్తున్నారు. బాధితుడు కృష్ణ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదర్శ గ్రామాలే లక్ష్యం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు : అభివృద్ధి పనులు చేసి గ్రామాలను ఆదర్శవంతముగా తీర్చిదిద్దడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని నరజాముల తాండాలో ప్రభుత్వ పింఛన్‌లను ఎరిక్షన్‌బాబు పంపిణీ చేశారు. కొత్తగా పింఛన్‌లు మంజూరైనట్లు చెప్పారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 1వ తేదీన పింఛన్, ఉద్యోగులకు జీతాలను అందజేస్తున్నామన్నారు. గత వైసీపీ పాలనలో ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు, కొత్తగా సీసీ రోడ్లతో గ్రామాల రూపురేఖలు మార్చుతున్నామన్నారు. ఎంపీడీవో బీ శ్రీనివాసులు, ఎంపీపీ వెంకటయ్య, టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగా నారాయణరెడ్డి, వేగినాటి శ్రీను, మంత్రునాయక్, సేవ్యా నాయక్ పాల్గొన్నారు.



కృష్ణకు పింఛన్ అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా మేడే



మేడే ర్యాలీలో పాల్గొన్న కృష్ణకిశోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పని చేస్తున్నారని టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి అన్నారు. మేడే సందర్భంగా గురువారం గిద్దలూరు పట్టణంలో మెకానిక్ వర్కర్స్ యూనియన్, నగర పంచాయతీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ నగర పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ ఐ.శ్రీనివాసులు, సీఐటీయూ నాయకులు ఆవులయ్య, కౌన్సిలర్లు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. హక్కుల సాధన కోసం కార్మిక వర్గం ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు వి.బాలకోటయ్య అన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకుడు టి.ఆవులయ్య, యూటీఎఫ్ నాయకుడు చంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంభం : ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆయా సంఘాల నాయకులు, కార్మికులు మేడే వేడుకను ఘనంగా నిర్వహించారు.

బేస్తవారపేట : పట్టణంలో సీపీఐ, ఏఐటయూసీ, సీఐటీయూ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడేని ఘనంగా నిర్వహించారు.

తర్లుపాడు : తర్లుపాడు బస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ నాయకులు గుమ్మా బాల నాగయ్య జెండాను ఆవిష్కరించారు.

మార్కాపురం వన్‌టౌన్ : విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మేడే ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పలుచోట్ల కార్మిక జెండాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు అందె నాసరయ్య, ఏఐటీయూసీ నాయకుడు షేక్ కాశీం పాల్గొన్నారు.

పొదిలి : కార్మిక దినోత్సవాన్ని కార్మిక సంఘాలు ఘనంగా నిర్వహించాయి. చిన్నబస్టాండ్ నుంచి పెద్దబస్టాండ్ మీదుగా విశ్వనాథపురం వరకు ర్యాలీ నిర్వహించారు.

పెద్ద దోర్నాల : కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జెండాలను ఆవిష్కరించారు.

పుల్లలచెరువు : కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలో జెండాను ఆవిష్కరించారు.

ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం మండలాల్లో మేడే వేడుకలను ఏఐటీయూసీ, సీఐటీయూకు సంబంధించిన ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు.



జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకుడు నాసరయ్య

కార్మికుల హక్కులు సమాజ పురోగతికి బలం : ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్ : కార్మికుల అంకిత భావాన్ని, త్యాగాలను స్మరించుకునే రోజు మే డే అని, ఈసందర్భంగా కార్మికులందరికీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. సమాజ నిర్మాణంలో కార్మికులు నిరంతరం తమ శ్రమతో విశేష పాత్ర పోషిస్తున్నారని, వారి కృషి వల్లే మనం అభివృద్ధి చెందగలుగుతున్నామని ఆయన కొనియాడారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని ఎంతో ప్రాధాన్యతగా భావిస్తుందని, ఉద్యోగ భద్రత, సరైన జీతాలు అమలులో ఉన్నాయని, నియోజకవర్గంలో కార్మికులకు మద్దతుగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు.



తొట్టెలో నీటిని తాగుతున్న పశువులు

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చొరవతో నీటి తొట్ల నిర్మాణం

అర్ధవీడు (కంభం), మే 1 (ఆంధ్రజ్యోతి): అర్ధవీడు మండలంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చొరవతో పలు గ్రామాలలో నిర్మించిన నీటి తొట్లు పశువుల దాహార్తి తీరుస్తున్నాయి. మండలంలోని చీమలేటిపల్లి, అంకభూపాలెం, అచ్చంపేట తదితర గ్రామాలలో ఈ వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్లను నిర్మించాలని మండల అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో పలు గ్రామాలలో నీటి తొట్లను నిర్మించారు. తొట్లను నిండుగా నీటితో నింపడంతో పశువులు దాహార్తిని తీర్చుకుంటున్నాయి.

హుషారుగా వేసవి శిక్షణ తరగతులు



బేస్తవారపేట గ్రంథాలయంలో పుస్తకపఠనం చేస్తున్న చిన్నారులు

గిద్దలూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ఆటపాటలు, డ్రాయింగ్‌తో హుషారుగా జరుగుతున్నాయి. రోజూ యోగా, చెస్, క్యారమ్స్, సంగీతం వంటివి పిల్లలకు నేర్పిస్తున్నారు. దేశభక్తి గీతాలు, పద్యాలు, కథలను చెప్తూ వాటి అర్థాన్ని వివరిస్తున్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, ఉపాధ్యాయుడు శివప్రసాద్ పాల్గొన్నారు.

బేస్తవారపేట : గ్రంథాలయంలో నాల్గో రోజు వేసవి శిక్షణలో 25 మంది విద్యార్థులు హాజరయ్యారు. స్వాతంత్ర్య సమర యోధుల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా సభ్యత్వం తీసుకున్న తల్లిదండ్రులను గ్రంథ పాలకుడు పీవీ సుబ్బారెడ్డి అభినందించారు.

పిడుగుపడి కాలిపోయిన పరికరాలు

మార్కాపురం, మే 1 (ఆంధ్రజ్యోతి) : జవహర్‌నగర్ కాలనీలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో బొచ్చు వెంకటేశ్వరరెడ్డి అనే రిటైర్డ్ ఉపాధ్యాయుని ఇంటిపై పిడుగుపడింది. దీంతో విద్యుత్ మీటర్, టీవీ, ఫ్యాన్లు వైర్లు పూర్తిగా కాలిపోయాయి. పిడుగు పడిన సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో అందరూ ఇంట్లో ఉండడంతో ప్రాణహాని జరగలేదు. పిడుగుపాటుకు చుట్టుపక్కల పది ఇళ్లల్లో విద్యుత్ పరికరాలు దెబ్బతిన్నాయి.

ప్రజారోగ్యంపై శ్రద్ధ వహించాలి

పారిశుధ్య సిబ్బందికి ఎమ్మెల్యే కందుల సూచన

మార్కాపురం, మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్యం పట్ల మున్సిపల్ పారిశుధ్య విభాగం ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక కంభం రోడ్డులోని అటవీశాఖ కార్యాలయం ముందు ప్రధాన మురుగు కాలువలో డీసిల్టింగ్ పనులను ఎమ్మెల్యే కందుల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం జూలైలో మార్కాపురం మున్సిపాలిటీకి టీపీఎస్ కింద మంజూరైన రూ.53లక్షల నిధులతో పట్టణంలోని డ్రైన్లు అన్నింటినీ శుభ్రం చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఒకదఫా శుభ్రం చేశారన్నారు. ఈ నెల 15వ తేదీలోగా రూ.20 లక్షలతో డీసిల్టింగ్ పనులు పూర్తవుతాయన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు ఎక్కడికక్కడ వారి వార్డుల పరిధిలో పనులను దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. ఎక్కడైనా లోపాలుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, ఏఈ భూపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు షేక్ మౌలాలి, మాలపాటి వెంకటరెడ్డి, కౌన్సిలర్ నాలి కొండయ్య, దారివేముల హర్షిత బాబీ, చిలకపాటి భవాని లింగమయ్య, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఆదిశంకరాచార్యుల జయంత్యుత్సవాలు

మార్కాపురం వన్‌టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు ఎస్.హరిప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో శంకరాచార్యుల మూలవిరాట్‌కు గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాసన, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాం, మంగళహారతులు నిర్వహించారు. తొలుత భారతుల నరసయ్య ఇంటి నుంచి శంకరాచార్యుల చిత్రపటాన్ని మంగళ వాయిద్యాలతో తీసుకొచ్చి వేదికపై ఆశీనులను చేశారు. శంకరాచార్యుల ఉత్సవ విగ్రహానికి, మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, బ్రాహ్మణ సంఘ నాయకులు పాల్గొని పూజలు చేశారు.



జగద్గురు విగ్రహానికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



యల్లారెడ్డిపల్లి గ్రామంలో దేవాలయం

నేటి నుంచి శిల ధ్వజ ప్రతిష్ఠోత్సవం

ఎర్రగొండపాలెం రూరల్ మే 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యల్లారెడ్డి పల్లి గ్రామంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు శిల ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రామపెద్దలు, భక్త బృందం గురువారం తెలిపారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి శ్రీ గోవిందమాంబ, సిద్ధయ్య శిలా ధ్వజ ప్రతిష్ఠ సందర్భంగా మూడు రోజులు ప్రత్యేక పూజలు, హోమాలు జరగనున్నట్లు తెలిపారు. ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పన్ను రాయితీ వసూళ్లలో నగర పంచాయతీ మొదటి స్థానం

గిద్దలూరు టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ చివరి నాటికి 5శాతం పన్ను రాయితీతో అన్ని రకాల పన్ను వసూళ్లలో గిద్దలూరు నగర పంచాయతీ జిల్లాలో మొదటి స్థానం నిలిచిందని నగర పంచాయతీ కమీషనర్ ఐ.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.5.07కోట్లు డిమాండ్ కాగా, గడిచిన నెలలో రూ.1.42కోట్లను 5శాతం పన్ను రాయితీతో వసూలు చేసి 27.80 శాతం వసూలు జరిగి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. గత ఏడాది కంటే 24లక్షలు అధికంగా వసూలు చేయడం జరిగిందన్నారు. పన్ను చెల్లింపుదారులు సకాలంలో పన్ను చెల్లించడం ద్వారా పట్టణాభివృద్ధిలో భాగస్వాములైనట్లు తెలిపారు.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్స్ కాలనీలోని ప్రభుత్వ ఐటీఐలో 2025-26 విద్యా సంవత్సరానికి మొదటి విడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నరేంద్రనాథ్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఫిట్టర్, డీజిల్ మెకానిక్, కోపా, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ కోర్సులలో పదో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 24లోపు దరఖాస్తులు పంపాలని వివరాలకు 9553306631 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.



ఇనుమును వేడి చేసి వంచుతున్న కార్మికుడు

కార్మికుడా సలాం

అందరికీ మేడే వేడుక. మాకు మాత్రం కూలికి కెళితేనే పొట్ట నిండేది.. కార్మిక దినోత్సవం రోజున కూడా ఎండలో శ్రమిస్తున్న కార్మికులకు మేడే శుభాకాంక్షలు

\- ఎర్రగొండపాలెం రూరల్ (ఆంధ్రజ్యోతి)

ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

కంభం, మే 1 (ఆంధ్రజ్యోతి) : విద్యా హక్కు చట్టం ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా 1వ తరగతి ప్రవేశాలకు తల్లిదండ్రులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవోలు మాల్యాద్రి, శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం పేదలకు 25శాతం సీట్లను ఉచితంగా కల్పించిందని 2 నుంచి 19వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాథలు, దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీలలోని అల్పాదాయ వర్గాల వారు అర్హులని తెలిపారు. 2019 జూన్ నుంచి 2020 మే 31 మధ్యలో జన్మించిన పిల్లలు అర్హులన్నారు.

పెద్దారవీడు : ప్రైవేటు పాఠశాలలో ఉచిత అడ్మిషన్లు కేటాయించినట్లు ఎంఈవో 1 శ్రీనివాసులు గురువారం తెలిపారు. మండలంలో తోకపల్లిలోని సిద్ధార్థ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో, సచివాలయంలో, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

రోడ్డు అభివృద్ధికి రూ.2.70కోట్ల నిధులు

గిద్దలూరు టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పలు రోడ్లకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి రూ.2.70కోట్ల నిధులను నాబార్డ్ నుంచి మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే కార్యాలయం వారు ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని పాములపల్లెకు వెళ్లే పంచాయతీరాజ్ రహదారి పూర్తిగా ఛిద్రమవగా ఎమ్మెల్యే స్పందించి మరమ్మతులకు రూ.1.80 కోట్ల నాబార్డు నిధులను మంజూరు చేయించారు. అలాగే కంభం మండలం చిన్నకంభం నుంచి బేస్తవారపేట జాతీయ రహదారి మరమ్మతులకు రూ.90లక్షల నిధులు మంజూరు చేయించినట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

గురుకులంలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

గిద్దలూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజన బాలుర సంక్షేమ గురుకుల పాఠశాలలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లునాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3వ తరగతిలో 40, 4లో 32, 5లో 32, 6లో 15, 7లో 20, 8లో 17, 9వ తరగతిలో 17 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఈనెల 20వ తేదీ లోగా పిల్లల కోసం దరఖాస్తులు చేయాలని పేర్కొన్నారు. 3వ తరగతిలో ఎస్టీలకు 32, ఎస్సీలకు 5, బీసీలకు 2, ఓసీలకు 1, మిగిలిన తరగతుల్లోని ఖాళీలను ఎస్టీలతో మాత్రమే భర్తీ చేస్తామన్నారు. ఖాళీలకు మించి దరఖాస్తులు వస్తే ఈనెల 30వ తేదీన లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని, వివరాలకు 9490227894 సంప్రదించాలన్నారు.

నేడు ఆధార్ నూతన కేంద్రం ప్రారంభం

గిద్దలూరు టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాచర్ల గేటు సెంటర్‌లోని సెయింట్ పాల్స్ పాఠశాలలో శుక్రవారం నూతన ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. ఈప్రాంతంలోని విద్యార్థులకు, సామాన్య ప్రజలకు విద్యా శాఖ ఆదేశాల మేరకు ఈ ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారులు కే వెంకటేశ్వర్లు, నాగభూషన్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు.

అంబులెన్స్ ఢీకొని మోటార్ సైక్లిస్టు మృతి

గిద్దలూరు టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్‌పై వెలుతున్న వ్యక్తిని అంబులెన్స్ ఢీకొనడంతో మృతిచెందిన ఘటన జరిగింది. అందిన సమాచారం మేరకు.. పట్టణ శివార్లలోని చాణక్య పాఠశాల వద్ద రాచర్ల మండలం సత్యవోలు గ్రామానికి చెందిన కిశోర్‌కుమార్ (36) మోటార్ సైకిల్‌పై వెలుతుండగా ఎదురుగా వస్తున్న అంబులెన్స్ ఢీకొనడంతో కిశోర్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం నంద్యాలకు తరలిస్తుండగా కిశోర్‌కుమార్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

4న నాయీ బ్రాహ్మణ వివాహ పరిచయవేదిక

ఒంగోలు కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి) : నాయీబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమం ఈనెల 4వతేదీన ఒంగోలులోని పద్మావతి ఫంక్షన్‌హాలులో నిర్వహిస్తున్నట్లు వేదిక కార్యదర్శి నాదెండ్ల రాఘవరావు తెలిపారు. గురువారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివాహ పరిచయ వేదికకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి నాయి బ్రాహ్మణులు పాల్గొంటున్న దృష్టా వినియోగించుకోవాలని కోరారు.

వేసవి దుక్కులతో రైతన్నకు మేలు

- ఖరీఫ్ సాగుకు సిద్ధం చేస్తున్న పొలాలు
- నేలను బట్టి దున్నితే మంచిదంటున్న వ్యవసాయాధికారులు

ఎర్రగొండపాలెం రూరల్ మే 1 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్ జూన్‌లో ప్రారంభం కానుంది. ఈక్రమంలో రైతులు గత వారం నుంచి ఖాళీగా ఉన్న పొలాలను దుక్కి దున్నుతున్నారు. ఖరీఫ్ ప్రారంభానికి ముందే వేసవి దుక్కులతో భూమిని సిద్ధం చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వేసవి దుక్కులు చేసుకోవడం వలన మెరుగైన పంట దిగుబడులు సాధ్యమవుతాయని చెప్తున్నారు. మామూలుగా రబీ సీజన్ తరువాత రైతులు పొలాలను ఖాళీగా ఉంచుతారు. ఆలా చేయడం వలన పొలాల్లో గడ్డి, పిచ్చి చెట్లు తదితర మొక్కలు పెరిగి సీజన్‌లలో వేసే పంటలకు ఖర్చులు పెరిగే అవకాశం ఉంటుందని చెప్తున్నారు. రైతులు ఖరీఫ్ సీజన్‌కు మందే అంటే వేసవి దుక్కి దున్ని సిద్ధం చేసుకోవాలని, దాంతో భూసారం పెరుగుతుందని వ్యవసాయాసంచాలకురాలు కె.నీరజ, ఏవో శేషారెడ్డి రైతులకు సూచిస్తున్నారు.



బోయలపల్లిలో దుక్కి దున్ని సిద్ధంగా ఉన్న పొలాలు

వేసే పంటలను బట్టి దున్నకాలు చేయాలి



ఖరీఫ్ సాగు చేసే పంటలకు తగ్గట్టు, నేల స్వభావాన్ని బట్టి దుక్కి దున్నుకుంటే మంచిదని, దానివల్ల ఎన్నో ఉపయోగాలు. ఈ సమయంలో దున్నకాల వలన సిలీంద్రాలు చనిపోతాయని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో జిల్లాతో పాటు ఈ ప్రాంతంలో భారీగా కురిసిన వర్షాలకు పదును ఉండడంతో దున్నకాలు ప్రారంభించారు. ఇప్పటి వరకు సుమారు 60 ఎకరాలు సిద్ధం చేశారు. మండలంలోని గురిజేపల్లి, బోయలపల్లి, అమానిగుడిపాడు, గోళ్లవీడపి, మురారిపల్లి తదితర గ్రామాల రైతులు పొలాల్లో దుక్కితో సిద్ధంగా ఉంచారు. మిగిలిన రైతులు కూడా వేసవి దున్నకాలు చేసుకోవాలి.

\- శేషారెడ్డి, వ్యవసాయాధికారి



కొత్తపల్లిలో దుక్కి దున్నుతున్న రైతు

వేసవి దుక్కితో సాగుకు అనుకూలం

వేసవి (మే)లో పొలాలను దుక్కి దున్నుకుంటే పంట సాగుకు అనుకూలంగా ఉంటుంది. పొలం ఖాళీగా ఉండటం వలన వివిధ రకాల పిచ్చి మొక్కలు మొలుస్తాయి. దీంతో ఖరీఫ్ సాగు సమయంలో ఖర్చు పెరుగుతుంది. దాని వలన మందుల ఖర్చు కూడా పెరుగుతుంది. సాగుకు నెల లేదా 15 రోజుల ముందే దుక్కి దున్నుకోవాలి.

\- వెంకటేశ్వరరెడ్డి, రైతు, గురిజేపల్లి

అవీ..ఇవీ


ఉపాధి పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

ఉపాధి హామీలో రైతులకు ఉపయోగపడే పనులు

పామూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీలో రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి కోరారు. మండలంలోని బొట్లగూడూరు పరిధిలోగల మోపాడు రిజర్వాయర్‌కు సంబంధించిన నీటి కాలువల పూడిక తీత పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వై. బాల, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కోటపాటి వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్ గుర్రం రమణయ్య, కోటపాటి రాజ, గుంజి శివన్నారాయణ, గూడూరు వెంకటాద్రి, ఉపాధి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఉచిత కారు డ్రైవింగ్ శిక్షణలో పాల్గొన్న యువకులు

నిరుద్యోగ యువతకు ఉచిత కారు డ్రైవింగ్ శిక్షణ

దొనకొండ, మే 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా ఉచిత డ్రైవింగ్ శిక్షణకు గురువారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆర్సీఎం సంస్థకు చెందిన జిల్లా సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ రెవరండ్ ఫాదర్ శౌరి మాట్లాడుతూ దాదాపు 20 మంది నిరుద్యోగ యువతకు కారు డ్రైవింగ్‌లో అనుభవం కలిగిన శిక్షకులతో డ్రైవింగ్ నేర్పించి లైసెన్స్ ఇప్పిస్తామన్నారు. కారు డ్రైవింగ్ నేర్చుకునే యువకులు పట్టుదలతో నేర్చుకొని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్సీఎం చర్చి సంఘ కాపరి రెవరండ్ ఫాదర్ గుడిపల్లి థామస్, పులువురు యువకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేవీ రమణయ్య

మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

పామూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రుల రాజధాని అమరావతి పునః నిర్మాణ ప్రారంభ వేడుకకు శుక్రవారం రాష్ట్రానికి విచ్చేయనున్న ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కేవీ రమణయ్య పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో అమరావతి పర్యటన సన్నాహక సమావేశం శనివారం నిర్వహించారు. మండల అధ్యక్షులు ఉమ్మడిశెట్టి శ్రీను, పి విజయకుమారచారి, ప్రధానకార్యదర్శి ఎస్. శివకృష్ణ, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ద్రోణాదుల వెంకట చరణ్, పాడే అరవింద్, తదితరులు పాల్గొన్నారు.


దొనకొండ రైల్వేస్టేషన్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ త్యాగరాజు

ప్రభు ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

దొనకొండ, మే 1(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో ప్రభు చారిటబుల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ అధినేత ఆదిమూలపు ప్రభుదాస్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ త్యాగరాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వేసవి ఎండలకు రైలు ప్రయాణికులకు, ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రభు ట్రస్టు ఏర్పాటు చేసిన చలివేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు గుంటు జాకబ్, రైల్వే ఆర్పీఎఫ్ సిబ్బంది, ప్రభు ట్రస్టు ఛైర్మన్ ఏ ప్రభుదాస్, ప్రతినిధులు జి. విజయ్‌కుమార్, ఎం. ఆనంద్, మోహన్ పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

దర్శి, మే 1(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబానికి లైన్స్‌క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో గురువారం రూ.11వేలు ఆర్థిక సహాయం అందించారు. మండలంలోని లంకోజనపల్లి ఎస్సీ కాలనీకి చెందిన సారమ్మ కొద్దిరోజుల క్రితం కూలీ పనులకు వెళ్తూ ఆటో ప్రమాదంలో మృతిచెందింది. ఈ నేపథ్యంలో డాక్టర్ ఎం. మల్లారెడ్డి, డాక్టర్ ఎస్. తేజశ్విని తదితరుల ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.11వేల సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో లైన్స్‌క్లబ్ ఆఫ్‌స్నేహ అధ్యక్షుడు తమ్మవరపు ఫణిబాబు, సభ్యులు వెంకటరెడ్డి, కాశింసాహెబ్, బి. ఆంజనేయులు, కె.విద్యాసాగర్‌రెడ్డి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు చంద్రబాబుకే సాధ్యం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి, మే 1 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాల అమలు సీఎం చంద్రబాబుకే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి లబ్ధిదారులకు పింఛన్‌ను అందజేశారు. మండలంలోని పేరంగుడిపల్లిలో, పట్టణంలోని పలువార్డుల్లో గురువారం పంపిణీ జరిగింది. ఎమ్మెల్యే ఆదేశాలంతో నియోజకవర్గంలోని పలు మండలాల్లో , వివిధ గ్రామాల్లో కూటమి నాయకులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఆదే సమయంలో కనిగిరిలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి పలువురు ఎమ్మెల్యేకు వివరించారు. అలాగే కనిగిరి అభివృద్ధిలో ప్రజాసహకారం కావాలని ఎమ్మెల్యే అభ్యర్థించారు. భవిష్యత్తు తరాలకు మంచి దారులు ఏర్పడాలంటే ఇప్పుడు ఉన్న ముళ్ళ గుంతల దారులను సరిచేయాల్సిందేనన్నారు. ఈ ఏర్పాటులో కొంతమందికి ఇబ్బందులు, నష్టం కల్గినా వారికి ఆ నష్టాన్ని పూడ్చేవిధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పేరంగుడిపల్లి కొత్తపల్లిలో రైల్వే లైన్ ఏర్పాటులో ఆటంకంగా ఉన్న గృహాలను తీసివేయించారు. ఆయా బాధితులకు ప్రధాన రోడ్డు వెంట 2.5 సెంట్లు స్థలంతో పాటు నిర్మాణానికి రూ2.5లక్షలు, రైల్వేలైన్ కాంట్రాక్టుచే మరో రూ.2లక్షలను ఎమ్మెల్యే బాధితులకు అందించారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ రవిశంకర్, ఎంపీడీవో హనుమంతరావు, జనసేన ఇన్‌చార్జి వరికూటి నాగరాజు, నాయకులు మాజీ ఎంపీపీ నంబుల వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, సైకం మాలకొండారెడ్డి, నారపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పిచ్చాల శ్రీనివాసులరెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, వీవీఆర్ మనోహరరావు (చిరంజీవి) తదితరులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.


దర్శిలో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, పాల్గొన్న నగర పంచాయతీ చైర్మన్ పిచ్చయ్య తదితరులు

పామూరులో

పామూరు, : పింఛన్లతో వృద్ధులకు భరోసా కలుగుతుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా అన్నారు. శుక్రవారం పింఛన్ల పంపిణీలో టీడీపీ శ్రేణులు పాల్గొని పరిశీలించారు.


పేరంగుడిపల్లి గ్రామంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

క్రమం తప్పకుండా పింఛన్లు

● మాజీ ఎమ్మెల్యే పాపారావు

దర్శి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతినెలా1వ తేదీన క్రమం తప్పకుండా పింఛన్లు అందుతుండటంతో అవ్వా తాతల కళ్లలో ఆనందం చూస్తున్నామని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తెలిపారు. దర్శిలో గురువారం ఆయన పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు రూ.4 వేలకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ దర్శి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు, జిల్లా నాయకుడు సంగా తిరుపతి రావు, తెలుగు మహిళ నాయకురాలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

సభకు వెళ్లేవారికి సకల ఏర్పాట్లు

● ఇన్‌చార్జి ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీవో వెంకటశివరామిరెడ్డి

కనిగిరి, మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ సభకు తరలి వెళ్లే వారికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ఇన్‌చార్జి ఆర్డీవో వెంకటశివరామిరెడ్డి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మోదీ కార్యక్రమంపై అధికారులతో గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు 10 బస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో తెలిపారు. వాటిలో సీఎస్‌పురం1, వెలిగండ్ల 1 బస్సు ఏర్పాటు చేయగా మిగతా కనిగిరి, పీసీపల్లి, హెచ్‌ఎంపాడు, పామూరు మండలాలకు 2 బస్సులు చొప్పున ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా నేడు (శుక్రవారం) ఆయా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాల వద్ద బస్సులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఒక్కో బస్సుకు 25 మందితో తరలి వెళ్లేందుకు ఏర్పాట్లు చేయగా ఆయా బస్సులకు ప్రత్యేకంగా ఇన్‌చార్జిని నియమించినట్లు తెలిపారు. ప్రతి మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్‌లతో పాటు వివిధ శాఖల అధికారులను పర్యవేక్షించాల్సిందిగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. బస్సుల్లో సభకు తరలి వెళ్లేవారికి ఉదయాన్నే పులిహోరతో పాటు వాటర్‌బాటిల్స్ 2, అరటిపండ్లు 2, 200ఎంఎల్ ఓఆర్ఎస్ ప్యాకెట్‌తో పాటు మజ్జిగ ప్యాకెట్‌లు అందిస్తామన్నారు. అదేవిధంగా మార్గమధ్యంలో మధ్యాహ్నానికి విజిటబుల్ బిరియానితో పాటు మళ్లీ అరటిపండ్లు 2, ఓఆర్ఎస్ ప్యాకెట్, వాటర్‌బాటిళ్లు అందిస్తామన్నారు. మధ్య మధ్యలో బిస్కెట్ ప్యాకెట్లతో పాటు శక్తినిచ్చే ఆరంజ్ జ్యూస్, ఓఆర్ఎస్, మజ్జిగ, మంచినీళ్ల బాటిళ్లను ఇస్తామన్నారు. తిరుగు ప్రయాణంలో భోజనానికి కిచిడి, వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేస్తారని వివరించారు. ముఖ్యంగా బస్సుల్లో సభకు తరలి వెళ్లే వారి పేర్లు, వివరాలను నమోదు చేసి తిరిగి స్వగ్రామాలు తరలించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సభకు వెళ్లే వారు వారి వివరాలను బస్సు ఇన్‌చార్జికి తప్పని సరిగా తెలియచేయాలని ఆర్డీవో కోరారు.


పూజలు చేసే ధ్యానమందిరం

నేడు బ్రహ్మేంద్రస్వామి 11వ వార్షిక వేడుకలు

దొనకొండ, మే 1(ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగురోడ్ల కూడలిలోని ఆనందఆశ్రమంలో వెలసిన బ్రహ్మేంద్రస్వామి దేవాలయం భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంలా ఇటీవల కాలంలో ప్రసిద్ధి చెందింది. నరసింహనాయునిపల్లె గ్రామానికి చెందిన బ్రహ్మంగారి పరమ భక్తుడు కాకర భైరవానందస్వామి దాతల సహకారంతో 2011లో ఆనంద ఆశ్రమానికి శంకుస్థాపన చేపట్టి దిక్కులేని అనాథలకు ఆశ్రయం కల్పించారు. ఆశ్రమ ఆవరణలో బ్రహ్మేంద్రస్వామి దేవాలయాన్ని నిర్మించి 2015లో ప్రతిష్ఠ నిర్వహించారు. అప్పటి నుంచి నేటి వరకు భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంలా బ్రహ్మేంద్రస్వామి దేవాలయం ప్రజల్లో గుర్తింపు పొందింది. దాతల సహకారంతో ఏడాది మొత్తం అయ్యప్ప, భవాని, శివమాల, బ్రహ్మేంద్రస్వామి తదితర దీక్షలు చేపట్టిన స్వాములకు నిత్యం అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ నెల 2వ తేదీన పదకొండవ వార్షిక వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ధర్మకర్త పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు.

వాడవాడలా మేడే వేడుకలు

దర్శి, మే 1(ఆంధ్రజ్యోతి): మేడే వేడుకలు దర్శి పట్టణంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు కార్మిక సంఘాలు ర్యాలీలు నిర్వహించాయి. సీఐటీయూ ఆధ్వర్యంలో సీపీఎం కార్యాలయం నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు , టి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు కె హనుమంతరావు, నాయకులు ఇత్తడి ఇర్మియా రామాంజీ పాల్గొన్నారు.



దర్శిలో మేడే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

ముండ్లమూరులో..

ముండ్లమూరు : ముండ్లమూరు, మారెళ్ల, శంకరాపురం, రాజగోపాలరెడ్డి నగర్ గ్రామాల్లో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించి కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. సీపీఎం నాయకులు వెల్లంపల్లి ఆంజనేయులు, మండల సీఐటీయూ కార్యదర్శి బోడపాటి హనుమంత రావు, గంగినేని సత్యనారాయణ, యర్రయ్య, నన్నం రామాంజనేయులు, రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పామూరులో మేడే కేక్‌ను కట్ చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పీసీపల్లిలో..

పీసీపల్లి : పీసీపల్లిలో సీఐటీయూ జెండాను వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల నాయకులు బడుగు జనార్దన్, వై.బ్రహ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

దొనకొండలో

దొనకొండ : స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, దర్శి వెళ్లే ప్రధాన రహదారిలో సీపీఎం నాయకుడు కర్నా హనుమయ్య మేడే పతాకాలను ఎగురవేశారు. నాయకులు కర్నా హనుమయ్య, కార్మికులు పి. ఆదాం, బాలకోటయ్య, కొండ ఏసుదాసు, ఇశ్రాయేలు, లూకయ్య, దావీదు, బోడయ్య, ఉదయ్‌కుమార్, బాలరాజు, మరికొందరు కార్మికులు, కార్యకర్తలు పాల్గొన్నారు .

పామూరులో

పామూరు : మేడే స్ఫూర్తితో కార్మికులు ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సయ్యద్ హనీఫ్ పిలుపునిచ్చారు. మేడే వేడుకలను సీఐటీయూ, ఏఐటీయూసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయ పార్టీల కార్యాలయాల నుంచి ప్రదర్శనగా నినాదాలు చేస్తూ పలు చోట్ల కార్మిక జెండాలను ఎగురవేసి మేడే కేక్‌ను కట్‌చేసి పంపిణీ చేశారు. ఈకార్యక్రమాల్లో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.


కనిగిరిలో ఏఐటీయూసీ జెండాలను ఆవిష్కరిస్తున్న నాయకులు రవీంద్రబాబు, యాసిన్‌లు

ప్రవేశపరీక్షలో మండల టాపర్ కౌశిక్


దారా కౌశిక్

ముండ్లమూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి ఇటీవల నిర్వహించిన పరీక్ష ఫలితాలు గురువారం వెలువడ్డాయి. ముండ్లమూరు ఎంపీపీఎస్ మెయిన్‌లో చదివిన దారా కౌశిక్ 78 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. దీంతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ పద్మావతి, ఉపాధ్యాయులు రాఘవ ప్రత్యేకంగా కౌశిక్‌ను అభినందించారు. అదే పాఠశాలలో మక్కెన విరాట్ శేఖర్ 71 మార్కులు సాధించి నాల్గవ ర్యాంకు సాధించారు. గుడిపాటి దీక్షిత 67 మార్కులు సాధించి ఎనిమిదవ ర్యాంకు సాధించారు. అదే విధంగా ఎంపీపీ స్కూల్ పోలవరం న్యూ స్కూల్‌లో అశోక్ బ్రహ్మతేజ 76 మార్కులు సాధించి రెండవ ర్యాంకు సాధించారు. వీరితో పాటు మరి కొంత మంది విద్యార్థులు కూడా మంచి ర్యాంకులు సాధించారు. వారిని పాఠశాల హెచ్ఎం పీ రమణారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

దొనకొండ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శ్రావణ్‌కుమార్


తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రావణ్‌కుమార్

దొనకొండ, మే 1(ఆంధ్రజ్యోతి): దొనకొండ మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా దర్శి తహశీల్దార్ ఎం. శ్రావణ్‌కుమార్‌కు ఉన్నతాధికారులు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది, టీడీపీ నాయకులు ఆయనకు శాలువాలు, పూలమాలలువేసి ఘనంగా స్వాగతం పలికి అభినందించారు. గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి రెవెన్యూ సమస్యలు ఉన్నా పరిష్కారానికి తమవంతు బాధ్యతగా పనిచేస్తానని, అందుకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

పహల్గాం మృతులకు సంఘీభావం

ఒంగోలు(రూరల్), మే1(ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడి మృతి చెందిన పర్యాటకులకు జిల్లా మాజీ సైనికులు సంఘీభావం ప్రకటించారు. గురువారం ఒంగోలులోని చర్చిసెంటర్‌లో మా నవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నెప్పల నాగేశ్వరరావు మాట్లాడుతూ జమ్ముకశ్మీర్‌లో పాకిస్తా న్‌కు చెందిన ఉగ్రవాదులను సైన్యం ఏరివేయాలన్నారు. 26మంది పర్యాట కులను ఉగ్రవాదులు కాల్చి చంపడం ఎంత మాత్రం సహించకూడని విషయమని, ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన పర్యాటకులకు నివాళలర్పించారు. నాయకులు ఆలపాటి వెంక టేశ్వర్లు, పాశం వెంకటరెడ్డి, మండవ వెంకటేశ్వర్లు, తుళ్లూరి వెంకటేశ్వర రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గెం శ్రీనివాసరావు, మాజీ సైనికులు పాల్గొన్నారు.


ఒంగోలు చర్చిసెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న మాజీసైనికులు

ఎమ్మెల్యే దామచర్లకు సత్కారం

ఒంగోలు కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి): ట్రెజరీ స ర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు గురువారం ఒంగోలులో దామచర్ల జనార్దన్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వీ.కృష్ణ, పి.అంకబాబు నూతన కమిటీ సభ్యులను పరిచయం చేశారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్లను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ట్రెజరీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ట్రెజరీ అధికారి జగన్నాథరావును నూతన కమిటీ సభ్యులు కలిశారు.

వైద్య విద్యార్థి యగ్నేష్‌కు కన్నీటి వీడ్కోలు

ఒంగోలు కార్పొరేషన్, మే 1 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో మరణించిన ఒంగోలుకు చెందిన వైద్య విద్యార్థి గుర్రం యగ్నేష్ అంత్యక్రియలు గురువారం నగరంలో జరిగాయి. స్థానిక భా గ్యనగర్ 3వలైనులోని ఆరో అడ్డరోడ్డులో నివసించే యగ్నేష్ నెల్లూరులోని నారా యణ మెడికల్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా బుధ వారం తన స్నేహితుడు చక్రధర్ సోదరి నిశ్చితార్థానికి వెళ్ళి వస్తూ ప్రమాదవ శాత్తు జరిగిన కారు ప్రమాదంలో యగ్నేష్ మృతి చెందాడు. ఈ సందర్భంగా బంధువులు, కాలేజీ సిబ్బంది, స్థానికులు పెద్ద సంఖ్యలో విచ్చేసి నివాలులర్పిం చారు. ఇంటికి పెద్ద కొడుకు అయిన యగ్నేష్ చిన్న వయసులోనే మరణించడంతో వారి కుటుంబం, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. మరో రెండేళ్ళలో చ దువు పూర్తి చేసుకుని డాక్టర్ అవుతాడని ఆశపడిన తల్లిదండ్రులను ఓదార్చడం అక్కడున్నవారికి సాధ్యపడలేదు. అనంతరం యగ్నేష్ అంతిమయాత్ర నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించారు.

ఉష్ణోగ్రత (అంచనా)

2-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	28
తెనాలి	39	28
నరసరావుపేట	40	28
బాపట్ల	37	28
రెంటచింతల	40	28


ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రులు పయ్యావుల కేశవ్, నారాయణ, రవీంద్ర, నాదెండ్ల మనోహర్


వెలగపూడి సభా ప్రాంగణం వద్ద పసుపు జెండాలతో స్వాగతం


టీడీపీ జెండాలతో అలంకరించిన ప్రకాశం బ్యారేజి


సభా ప్రాంగణానికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బారికేడ్లు



నవశకానికి.. నేడే నాంది

ఐదేళ్ల వైసీపీ విధ్వంస బంధనాల నుంచి విముక్తి కలిగి రాజధాని అమరావతి పునర్వికాసం దిశగా పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. అమరావతి రాజధాని నిర్మాణ పనుల పునరుద్ధరణతో రాష్ట్ర చరిత్రలో నవశకానికి శుక్రవారం బీజం పడనుంది. అందరూ ఆశగా ఎదురుచూస్తున్న రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపన పండుగ వాతావరణంలో జరుపుకునేందుకు సకల ఏర్పాట్లు జరిగాయి. వెలగపూడిలోని సచివాలయం సమీపంలో శంకుస్థాపన, బహిరంగసభకు భారీగా ఏర్పాట్లు జరగ్గా.. రాజధాని జిల్లా గుంటూరుతో పాటు సమీప బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి ప్రజలు వేలాదిగా తరలిరానున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ రానుండటం, ఒకేసారి రూ.లక్ష కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టడంతో అందరూ అమరావతివైపు ఆశగా చూస్తున్నారు. పోదం పద మోదీ సభకి.. జై కొడదాం అమరావతికి అంటూ జనం సిద్ధమవగా.. వారి రవాణా, భోజనం, తాగునీటి తదితర వసతులకు అధికార యంత్రాంగం ఎక్కడిక్కడ విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. ఇక రాజధాని గ్రామాల్లో అమరావతి నిర్మాణ శంకుస్థాపనను ఓ మహోత్సవంలా రాజధాని రైతులు, మహిళలు భావిస్తున్నారు.



ప్రధాని మోదీ ఆవిష్కరించే పైలాన్

ప్రధాని పర్యటన సాగేదిలా...

ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం కేరళ నుంచి మధ్యాహ్నం 2.45కి గన్నవరం విమానాశ్ర యానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 2.50కి ఎంఐ-17 హెలికాప్టర్‌లో బయల్దేరతారు. మధ్యాహ్నం 3.10కి వెలగపూడి సచివా లయానికి సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యా డ్‌కు చేరుకుంటారు. హెలిప్యాడ్ వద్ద సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రధానికి స్వాగతం పలుకుతారు. 3.20కి సభా ప్రాంగణానికి చేరుకుని 10 నిమిషాలు విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం 3.30 నుంచి 4.45 గంటల మధ్య శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారు. బహిరంగ సభ అనంతరం సాయంత్రం 4.45 గంటలకు తిరుగు ప్రయాణమై 4.50కి హెలిప్యాడ్‌కు చేరుకుని సాయంత్రం 5.15కి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు.

- అమరావతి పునర్నిర్మాణానికి ప్రధాని పునాదిరాయి
- ఏ ఆకృతిలో 20 అడుగుల పైలాన్.. ఆవిష్కరించనున్న మోదీ
- వెలగపూడిలో సభకు భారీ ఏర్పాట్లు.. లక్షలాదిగా తరలిరానున్న ప్రజలు
- రాజధానికి కొండంత భరోస ఇవ్వనున్న ప్రధాని నరేంద్రమోదీ పర్యటన

తుళ్లూరు(వెలగపూడి), గుంటూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): నేనున్నానంటూ కొండంత భరోసా కల్పించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం అమరావతి పర్యటనకు వస్తున్నారు. రాజధాని చరిత్రలో 2025 మే 2వ తేదీ సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని అంతా భావిస్తున్నారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణ సభకు ఏర్పాట్లు అన్నీ పూర్తయ్యాయి. ప్రధానమంత్రి హాజరుకానుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భారీగా ఏర్పాట్లు చేసింది. వెలగపూడి సచివాలయం పడమర వైపున భారీగా చేపట్టిన ఏర్పాట్లను అధికారులు గురువారానికే పూర్తి చేశారు. హెలిప్యాడ్ నుంచి వేదిక వరకు ప్రధానమంత్రి కాన్వాయ్ ట్రైల్ రన్(రిహార్సల్) విజయవంతంగా నిర్వహించారు. ప్రధాని వేదికకు కుడివైపున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి, ఎడమ వైపున పారిశ్రామిక వేత్తలు ఆశీనులవడానికి ప్రత్యేకంగా వేదికలను ఏర్పాటు చేశారు. శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించి 20 అడుగుల పైలాన్‌ని ఆంగ్లంలో ఏ ఆకారంలో సీఆర్‌డీఏ నిర్మించింది. ముకుళిత హస్తాలతో నమస్కరిస్తూ అమరావతికి స్వాగతం పలుకుతున్నట్లుగా పైలాన్‌ని తీర్చిదిద్దింది. రూ.49,040 కోట్ల పనులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఇందులో హైకోర్టు, సెక్రటేరియట్, అసెంబ్లీ, న్యాయమూర్తుల నివాస సముదాయాలు వంటివి ఉన్నాయి. అలా నే ఎమ్మెల్యేలు, మంత్రులు అఖిల భారత స ర్వీసెస్ అధికారుల గృహ సముదాయం పెండింగ్ పనులకు కూడా శంకుస్థాపన చేస్తారు. కేంద్ర ప్రభు త్వానికి సంబంధించిన వివిధ సంస్థలు ఏర్పా టు చేయబోయే కార్యాలయాల భవనాలకు కూడా పునాదిరాయి వేస్తారు. వీటితో పాటు రైలుమార్గాలు, హైవేలు, మిసైల్ టెస్టు రేంజ్, వైజాగ్‌లో యూనిటీ మాల్ వంటి పనులకు కూడా శంకుస్థాపన చేస్తారు. గ్యాలరీలన్నీ నిండినా ఇబ్బంది రాకుండా సభావేదికకు బయట వైపున ప్రత్యేకంగా టెంట్లు వేసి అక్కడ భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాట్లు చేశారు. కాగా ప్రధాని మోదీ బహిరంగ సభలో చేసే ప్రసంగంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. అమరావతికి ఇప్పటికే కేంద్రం సాయం ప్రకటించి బ్యాంకింగ్ సంస్థల నుంచి నిధులు ఇప్పించింది. భవిష్యత్తులోనూ అమరావతికి వరాల జల్లు కురిపించేలా మోదీ హామీలు ఇస్తారని చాలామంది ఆశిస్తున్నారు.


సుందరంగా సభా ప్రాంగణం

పడిలేచిన అమరావతి

ఐదేళ్ల వైసీపీ చీకటిపాలనలో నిత్యం పోరాటాలు, ఉద్యమాలతో అట్టుడికిన అమరావతి నేడు ఒక గ్లోబల్ సిటీగా రూపాంతరం చెందేందుకు సిద్ధమైంది. మూడు రాజధానుల కుట్రతో కునారిల్లిన ఆంధ్రుల కలల రాజధాని అమరావతి మళ్లీ జీవం పోసుకుంటున్నది. 2014-2019 మధ్యలో అప్పటి టీడీపీ ప్రభుత్వం పలు కీలకమైన పనులను ప్రారంభించింది. సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ భవనాల నిర్మాణంతో పాటు ఉన్నత స్థాయి అధికారులకు, ప్రజాప్రతి నిధులకు అవసరం అయిన వసతి భవనాలను చాలా వరకు పూర్తి చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతి పనులను నిలిపేసి.. మూడు రాజధానుల డ్రామాతో ఐదేళ్లు కాలక్షేపం చేసింది. ఈ క్రమంలో అమరావతికి భూములు ఇచ్చిన రైతుల చిరకాల పూజలు ఫలించి రాజధాని రూపకర్తగా ఉన్న చంద్రబాబునాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చంద్రబాబు నాయుడు గెలవడంతోనే అమరావతి మళ్లీ ఊపిరి పోసుకుంది.

మూడు ముక్కలాటలో ఎందరో బలి

జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే మొదలుపెట్టిన మూడు ముక్కలాటలో వందల మంది రైతులు అశువులు బాశారు. తీవ్ర ఆవేదనకు గురైన ఆ గుండెలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. వారి కుటుంబాలు ఛిద్రమైపోయాయి. రాజధాని కోసం భూమిని అప్పగించిన వారి త్యాగమే వారి పాలిట మృత్యుపాశమైంది. రాజధానిగా అమరావతి ప్రకటన సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న వైసీపీ అధినేత జగన్ సంపూర్ణ ఆమోదం తెలిపారు. దీంతో రైతులు ఎలాంటి సందేహాలు లేకుండా భూములు ఇచ్చేశారు. ఎన్నికల సమయంలో రాజధాని తరలింపుపై రైతుల్లో అనుమానాలు రేకెత్తగా.. జగన్మోహన్‌రెడ్డి ఇక్కడే తాడేపల్లిలో ఇల్లు కట్టుకున్నానని, రాజధాని ఎక్కడికీ పోదని అధికార పార్టీ నేతలు నమ్మించారు. ఎన్నికల అనంతరం అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి అదే ఏడాది డిసెంబరులో చేసిన మూడు రాజధానుల ప్రకటనతో రైతులు హతాసులయ్యారు. అమరావతే రాజధాని కావాలంటూ గ్రామ స్థాయిలో మహిళలు, రైతులు చేపట్టిన ఉద్యమం గత ఐదేళ్ల మహోద్యమంగా సాగింది. రాజధాని పరిధిలోని 33 గ్రామాలకు చెందిన అన్నివర్గాల ప్రజలు చేపట్టిన ఉద్యమం ఉవ్వెత్తున సాగింది. అయినా వెనక్కి తగ్గని వైసీపీ ప్రభుత్వం తీరుతో అనేక మంది రైతులు అశువులు బాశారు. భూములు ఇచ్చి మనోవేదనతో దొండపాడులో 25 మంది, అనంతవరంలో 12 మంది, మల్కాపురంలో 23 మంది, తుళ్లూరులో 20 మంది, మందడంలో 19 మంది, వెలగపూడిలో 17 మంది, బేతపూడిలో ఆరుగురు, ఐనవోలులో 14 మంది, నీరుకొండలో 13 మంది, నేలపాడులో 12మంది రాయపూడి, ఎర్రబాలెంలో 10 మంది, కృష్ణాయపాలెంలో ఏడుగురు, కురగల్లు, వెంకట పాలెంలో ఐదుగురు చొప్పున, లింగాయపాలెంలో నలుగురు, నవులూరు, నిడమర్రు, నెక్కల్లు ముగ్గురు పెద్దపరిమిలో నలుగురు చొప్పున, తాళ్లాయపాలెం, అబ్బరాజుపాలెం, బోరుపాలెంలో ఇద్దరు చొప్పున రైతులు, రైతుకూలీలు, కౌలుదారులు మరణించారు. ఇవే కాకుండా ఇంకా గుర్తింపులోకి రాని మరణాలు మరో 50 వరకూ ఉంటాయని రైతులు చెబుతున్నారు. మూడు రాజధానుల ప్రకటన రాజధాని రైతులనే కాదు, ఆ ప్రాంతంలోని రైతు కూలీలను, ఇతర వృత్తులవారిని కూడా ఆవేదనకు గురిచేసింది. ఒకవైపు రైతుల ప్రాణాలు పోతున్నా రైతుల గుండె ధైర్యం జారిపోలేదు. పట్టుదలగా 1631 రోజులపాటు పోరాటాన్ని కొనసాగించి, ఎన్నికల్లో వైసీపీ ఓటమికి ఊరూరు తిరిగి ప్రచారం చేసి కోరుకున్న ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకున్నారు.



విధ్వంసం నుంచి పునర్వికాసం

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ మూడు రాజధానుల పేరు చెప్పి అమరావతిని నాశనం చేసింది. అంతకుముందు టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పనులను నిలుపుదల చేయించింది. కేంద్ర సంస్థలకు కూడా భూములివ్వలేదు. అమరావతితో అనుసంధానమైన జాతీయ రహదారి, నూతన రైలుమార్గం పనులకు సహకరించలేదు. మూడు రాజధానులు అని ఒకవైపు చెబుతూ.. అమరావతిని కనీస రాజధానిగా కూడా గుర్తించకుండా అభివృద్ధి విఘాతానికి పాల్పడింది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ అమరా వతిపై ఆశలు ఏర్పడ్డాయి. గత ఐదేళ్ల విధ్వంసాన్ని సరిచేయడానికి అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఐకానిక్ భవనాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అయినా మొక్కవోని ధైర్యంతో రాష్ట్రప్రభుత్వం ఐఐటీ నిపుణులతో పరీక్ష చేయించింది. యాక్షన్ ప్లాన్‌ను తయారు చేసుకుని కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిధులను సమీకరించుకుని అమరావతి పునర్నిర్మాణ పనుల దిశగా అడుగులు పడ్డాయి. అడవిగా మారిన అమరావతిని పూర్వస్థితికి తీసుకు రావడం, ఐకానిక్ కట్టడాల బేస్‌మెంట్‌లో ఉన్న నీటిని తోడేయడం వంటివి చేయడంతో పాటు సమాంతరంగా టెండర్ల ప్రక్రియను నిర్వ హించి వాటిని ఖరారు చేసి ఎల్వోఏలను ఇచ్చారు. టెండర్లు దక్కించుకున్న సంస్థలు చాలావరకు పనుల ప్రారంభానికి సిద్ధమ య్యాయి.



అమరావతి రూపురేఖలను మార్చేలా..

అమరావతికి మళ్లీ ఊపిరిలూదడంతో పాటు రూపురేఖలను మార్చేలా భారీ మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మౌలిక సదు పాయాల కల్పనకు రూ.77,250 కోట్లతో పనులు నిర్దే శించారు. ఇవికాకుండా మరో రూ.30 వేల కోట్లకు సంబంధించిన పనులు, అనుబంధ పనులను నిర్దేశించు కున్నారు. రూ.49 వేల కోట్ల పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు.

ప్రధాని సభకు భారీగా..

- ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలి
- బస్సులలో 50శాతం ప్రజాప్రతినిధులకు కేటాయించాలి
- జిల్లాకు 350 బస్సులు
- కలెక్టర్ జే వెంకటమురళి

బాపట్ల, మే 1 (ఆంధ్రజ్యోతి) : అమరావతి పునర్ నిర్మాణ కార్యక్రమానికి జిల్లా నుంచి తరలి వెళుతున్న ప్రజలకు ఎటువంటి ఆసౌకర్యం కలగకుండా చూసుకోవాలని కలెక్టర్ వెంకటమురళి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అమరావతి వెళ్ళే ప్రజల కోసం జిల్లా వ్యాప్తంగా 350 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి మండలానికి అధిక సంఖ్యలో బస్సులు కేటాయించినట్లు తెలిపారు. కేటాయించిన బస్సులలో 50 శాతం ప్రజాప్రతినిధులకు కేటాయించాలని ఎంపీడీవోలకు సూచించారు. ప్రతి బస్సులో ఒక మహిళా పోలీసు, ఆశావర్కర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సహాయకులుగా ఉంటారన్నారు. ప్రజలు తిరిగి వారి గ్రామాలకు చేరుకునే వరకు పూర్తి బాధ్యత వారిదేనని కలెక్టర్ తెలిపారు. బస్సులోని ప్రయాణికులకు ఒక్కొక్కరికి 4 ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను సరఫరా చేయాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రజల కొరకు ఏర్పాటు చేసిన బస్సులు గురువారం రాత్రి 7 గంటలు నుంచి 9గంటలలోపు కేటాయించిన ప్రాంతాలకు చేరుకునేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బస్సులో వచ్చిన డ్రైవర్, సహాయకులకు రాత్రిభోజన, బస ఏర్పాట్లు చేయాలని చెప్పారు. రెండో తేదీ ఉదయం అల్పాహారాలు ముగించుకొని 9గంటలలోపు బస్సులు బయలుదేరాలని వాటికి సంబంధించిన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.


క్షేత్రస్థాయిలో పర్యటించి స్టాల్స్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ జే వెంకటమరళి

మండలాలవారీగా నాలుగుస్టాల్స్ ఏర్పాటు

బాపట్ల జిల్లా నుంచి తరలి వెళ్ళే ప్రజలకు మధ్యాహ్నం, రాత్రికి భోజన సౌకర్యాలు, తాగునీటి సౌకర్యాలు మండలాలవారీగా నాలుగుప్రాంతాలలో స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు.మార్టూరు, యద్దనపూడి, అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె.పంగులూరు, కొరిశపాడు మండలాలు నుంచి వచ్చే ప్రజలకు మార్టూరు దాటిన తర్వాత తాడిపూడి గ్రామం వద్ద స్టాల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పర్చూరు, చినగంజాం, కారంచేడు, చీరాల, వేటపాలెం, ఇంకొల్లు మండలాలు నుంచి వచ్చే ప్రజలకు ప్రత్తిపాడులో పెట్రోల్ బంకు దగ్గర, బాపట్ల,కర్లపాలెం, నగరం, చెరుకుపల్లి మండలాల నుంచి వచ్చే ప్రజలకు పొన్నూరు ఆర్టీసీ బస్టాండ్‌లో, రేపల్లె, వేమూరు, నిజాంపట్నం, అమర్తలూరు, భట్టిప్రోలు, చుండూరు, పిట్టలవానిపాలెం మండలాలకు చెందిన ప్రజలకు నందివెలుగు సర్కిల్ దగ్గర భోజన స్టాల్స్ ఏర్పాటు చేయటమైనదని కలెక్టర్ తెలిపారు. బస్సులో ప్రయాణించే వారు అనారోగ్యానికి గురైతే సమీప ఆరోగ్య కేంద్రాలకు తరలించేందుకు ఆరోగ్య కేంద్రాల సమాచారం తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పొన్నూరు రూట్‌లోని భోజనస్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 25 మండలాలకు కోఆర్డినేటర్లను ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ రూమ్ నుంచి కోఆర్డినేటర్లు ఆయా మండలాధికారులను ఫోన్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తుంటారన్నారు. బస్సు బయలు దేరిన దగ్గర నుంచి తిరిగి గ్రామానికి చేరుకునే వరకు కోఆర్డినేటర్లు పర్యవేక్షిస్తుండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి ఈబీ విలియమ్స్, జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ పాల్గొన్నారు.

వేలు పట్టుకుంటేనే వ్యాధి నయమంట?

తమిళనాడు బృందంపై శింగరకొండ దేవస్థాన అధికారుల ఫిర్యాదు

అద్దంకి, మే 1 (ఆంధ్రజ్యోతి): మందుల అవసరం లేకుండా చేతి వేళ్ల పట్టుకుంటే వ్యాధులు నయం అవుతాయని నమ్మిస్తూ.. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా తమిళనాడుకు చెందిన ఓ బృందం డబ్బులు వసూలు చేస్తోంది. ప్రతి గురువారం శింగరకొండ ఆంజనేయస్వామి దేవాలయానికి సమీపంలో ఓ సామాజికవర్గానికి చెందిన అన్నదాన సత్రాన్ని వేదికగా తమిళనాడు బృందం వైద్య శిబిరాన్ని నిర్వహిస్తుంది. ఏ వ్యాధి ఉన్నా చేయి పట్టుకుని పరీక్షించి ఒక వేలును తాకితే వ్యాధి నయమైపోతుందని ఒక్కో వ్యక్తి నుంచి రూ.300 వసూలు చేస్తున్నారు. గురువారం ఆలయానికి భక్తుల సంఖ్య తక్కువగా ఉంటున్నా అన్నదానం కోసం పెద్దసంఖ్యలో రావడంతో దేవస్థాన ఈవో తిమ్మానాయుడు ఆరా తీశారు. దీంతో తమిళనాడు బృం దం కార్యకలాపాలు వెలుగులోకి వచ్చాయి. ఆ బృందం ప్రజలను మోసం చేస్తున్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు.


వైద్యం కోసం బారులు తీరి ఉన్న ప్రజలు

అవీ..ఇవీ..

మోదీ సభకు తరలిరావాలి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

బల్లికురవ. మే 1 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజదాని పునర్నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ప్రదానమంత్రి నరేంద్రమోడీ శుక్రవారం అమరావతికి వస్తున్నారని పార్టీ నేతలు కార్యక్రమానికి పెద్దఎత్తున తరలి రావాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగొంట్ల కోటేశ్వరరావు కోరారు. బల్లికురవ మండల టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రధాన మంత్రి కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు అధికారులతో, పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, అయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా అమరావతి రాజధానిని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక డిజైన్‌తో అబివృద్ధి చేస్తున్నారన్నారు. ఇందుకు ప్రజలంతా మద్దతు తెలపాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కుసుమకుమారి, పంచాయతీ కార్యదర్శులు, టీడీపీ మండల నేతలు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి

పంగులూరు: భారత ప్రధాని నరేంద్రమోదీ అమరావతి పర్యటన కార్యక్రమంలో ఉద్యోగులు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి బాలమ్మ అన్నారు. ప్రధాని అమరావతి పర్యటనకు మండలం నుంచి 11 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సిబ్బంది వ్యవహరించాలని కోరారు. బస్సులలో ఎక్కిన ప్రజానీకానికి ఉదయం 8 గంటలకు సచివాయాల వద్ద అల్పాహారం ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారిపై తాతపూడి వద్ద ఉదయం, సాయంత్రం భోజన ప్యాకెట్లు అందజేస్తామన్నారు. బస్సులలో మహిళా పోలీస్‌తో పాటు వైద్య సిబ్బంది ప్రజలతో ఉండి వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని బాలమ్మ కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అనంతరాజు, ఎంపీడీవో స్వరూపారాణి, ఏఈ హనుమంతరావు, శివయ్య, ఏపీఎం జ్యోతిప్రసాద్, ఏపీవో సంతోషం, రెవెన్యూ, పంచాయతీరాజ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతి సభకు 26 బస్సులు

అద్దంకి : అమరావతి పునఃనిర్మాణ సభకు ప్రజలు తరలివెళ్లేందుకు అద్దంకి డిపో నుండి 26 బస్సులను కేటాయించినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. అద్దంకి డిపో బస్సులను కాకుమాను మండలంలోని గ్రామాలకు కేటాయించగా బుధవారం సాయంత్రం బయలుదేరి వెళ్లినట్లు తెలిపారు. అద్దంకి డిపోలో అద్దె బస్సులతో కలిపి మొత్తం 62 బస్సులుండగా, 26 ఆర్టీసీ బస్సులను సభకు తీసుకు వెళ్లే ప్రజల కోసం పంపినట్లు, మిగిలిన బస్సులు ఆయా రూట్లలో తిరుగుతాయన్నారు.

ఇంకొల్లు నుంచి అమరావతికి 11 బస్సులు

ఇంకొల్లు : రాజధాని అమరావతి పునర్నిర్మాణానికి విచ్చేయుచున్న ప్రధానమంత్రి మోడీ బహిరంగసభకు ఇంకొల్లు మండలం నుండి 11 బస్సులు ఏర్పాటు చేసినట్లు ఎపిఎం అనూరాధ తెలిపారు. 2వ తేదీ ఉదయం 9 గంటలకు బస్సులు ఆయా గ్రామాల నుంచి బయలుదేరతాయన్నారు. వీరందరికీ, అల్పాహారం, భోజనం, మజ్జిగ, మంచినీరు వంటి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు కోరారు.

ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల


పూజల్లో పాల్గొన్న కరణం వెంకటేష్

వేటపాలెం(చీరాల), మే 1 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం దేశాయి పేట గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ తిరునాళ్ల అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయన వెంట పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి

దేశాయి పేటలో వేంచేసిన పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పాల్గొన్నారు. పోలేరమ్మ, పోతురాజు విగ్రహాల పునఃప్రతిష్ఠ, శేఖర కలిశ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా తిలకించారు. ఆయన వెంట పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాతి మండపం నిర్మాణానికి రూ.లక్ష విరాళం


ఈవో తిమ్మానాయుడుకు చెక్కును అందజేస్తున్న శ్రీనివాసరావు కుటుంబసభ్యులు

అద్దంకి, మే 1 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణానికి అద్దంకికి చెందిన చల్లాపల్లి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు గురువారం రూ.1,00,116 లను ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. శ్రీనివాసరావు కుటుంబసభ్యులు వీరాంజమ్మ, శ్రీనివాసనవీన్, కొల్లా వెంకటరత్తమ్మ, యర్రా చలపతిరావులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు కిట్లు అందజేత


క్రీడాదుస్తులను అందజేస్తున్న ఎస్.ఐ రమేష్, ముసలారెడ్డి

చినగంజాం, మే 1(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంఎస్‌ఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్, చినగంజాం బాలకోటేశ్వరస్వామి స్పోర్ట్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న కబడ్డీ వేసవి శిక్షణ శిబిరంలోని క్రీడాకారులకు క్రీడా కిట్లను అందజేశారు. గత నెల 20వ తేదీ నుండి క్రీడాకారులకు కబడ్డీ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ఎం.గిరిబాబు తెలిపారు. కబడ్డీ వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న 70 మంది క్రీడాకారులకు యర్రం పిచ్చమ్మ జ్ఞాపకార్థం రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి రూ.25 వేల రూపాయిలు విలువ చేసే క్రీడాకిట్లు, జీటి.అంకిరెడ్డి, చిట్టా మధుసూదన్‌రెడ్డిలు 30 మంది క్రీడాకారులకు పదివేల రూపాయిలు విలువైన క్రీడా కిట్లు అందజేసినట్లు తెలిపారు. దాతలు అందజేసిన క్రీడాకిట్లును ఎస్.ఐ శీలం రమేష్, సీనియర్ కబడ్డీ, చెడుగుడు క్రీడాకారుడు ఆట్ల ముసలారెడ్డిలు క్రీడాకారులకు గురువారం అందజేశారు. కబడ్డీ వేసవి శిక్షణ శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

అవ్వా, తాతలకు పెన్షన్‌తో మేలు

- ఎమ్మెల్యే కొండయ్య
- గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేసిన టీడీపీ నేతలు


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, పక్కన శ్రీనివాసరావు

చీరాల, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఎటువంటి ఆసరా లేక అవస్థలు పడుతున్న అవ్వా, తాతలకు టీడీపీ కూటమి అందిస్తున్న పెన్షన్‌తో ప్రయోజనమని, రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు, నిరాశ్రయులకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ పంపిణీ కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్థానిక 29వ వార్డు, వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పథకాలు ఒడిదుడుకులు ఎన్నున్నా పెన్షన్లలో జాప్యం ఉండదని, ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తుందని అన్నారు. అలాగే మున్సిపల్ 29వ వార్డులో సుమారు స్థానిక నాయకులు వల్లెపు వేణు ఆధ్వర్యంలో 100 కుటుంబాలను పార్టీలోకి కండువాతో ఆహ్వానించారు. చల్లారెడ్డిపాలెంలో చలివేంద్రంను ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఏఎంసీ ఛైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, మునిసిపల్ కమీషనర్ అబ్దుల్ రషీద్, డిఈ రఘురామ్ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న టీడీపీ నేతలు

బల్లికురవ : ఎన్నికలలో ఇచ్చిన హమీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకొని పింఛన్ల సొమ్మును రెట్టింపు చేసి నిరుపేదలకు అండగా నిలిచిందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగొంట్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం బల్లికురవ మండల పరిషత్ కార్యాలయం వద్ద పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమకుమారి, టీడీపీ మండల నాయకులు గొట్టిపాటి లక్ష్మయ్య, సర్పంచ్ అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ

పంగులూరు : మండలంలోని ముప్పవరం గ్రామంలో నూతనంగా ఎన్నికైన టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యం లో గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదా రులకు టీడీపీ మండల నేత కుక్కపల్లి ఏడుకొండలు, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు వరపర్ల సుబ్బారావు, గ్రామకమిటీ నూతన అధ్యక్షులు వేల్పుల మరియదాసు, ఉపాధ్యక్షులు మేకపోతుల మోహన్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి కుక్కపల్లి నరేష్‌లు స్థానిక సిబ్బందితో కలసి ఫించన్లు అందచేశారు. కార్యక్రమంలో అద్దేపల్లి ఏసుబాబు, వేల్పుల జయప్రకాష్, మాజీ అధ్యక్షులు, చింతల నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

పట్టణంలో 94.5 శాతం, గ్రామాల్లో 95 శాతం పంపిణీ

అద్దంకి : పింఛన్ల పంపిణీని గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ కూటమి నేతలు పర్యవేక్షించారు. గురువారం రాత్రి 7 గంటల సమయానికి అద్దంకి పట్టణంలో మొత్తం 3,823 మందికి గాను 3613 మందికి పంపిణీ చేసి 94.51 శాతం పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. అద్దంకి మండల పరిధిలో మొత్తం 6915 మందికి గాను 6568 మందికి పంపిణీ చేసి 94.98 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో శింగయ్య తెలిపారు.

భర్త చనిపోయిన నెలకే భార్యకు పెన్షన్

- ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే ఏలూరి
- గిరిజన వృద్ధ మహిళకు పెన్షన్ పంపిణీ

పర్చూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : భర్త చనిపోయి నెల రోజుల తిరకముందే భార్యకు గురువారం వింతంతు పెన్షన్ అందించి కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించింది. మండల కేంద్రమైన పర్చూరు ఇందిరా కాలనీకి చెందిన దేవరకొండ కోటేశ్వరరావు ఇటీవల మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావటం, భర్త ఆకస్మిక మరణంతో వృద్దురాలు తిరుపతమ్మ ఆందోళనకు గురిఅయ్యింది. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు యద్ద ప్రాతిపతికన ప్రభుత్వ పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తక్షణం స్పందించిన అధికారులు వృద్దురాలకు పెన్షన్ మంజూరు చేశారు. దీంతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు అధికారుల సార్థ్యంలో పెన్షన్ వృద్దురాలికి అందజేశారు. ఈకార్యక్రమంలో మండలపార్టీ అద్యక్షులు షేక్.షంషుద్దీన్, కోడూరి శేషబ్రహ్మాచారి, ఆకుల శ్రీనివాసరావు, కొల్లా శివరాం ప్రసాద్, షేక్.గౌస్, షేక్.ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.


పింఛన్ అందజేస్తున్న టీడీపీ నాయకులు

పార్టీ పార్టీనే... అవిశ్వాసం అవిశ్వాసమే..!

- ఎమ్మెల్యే, మన్సిపల్ ఛైర్మన్ కలిసిన వేళ చమక్కులు
- మరోసారి పార్టీ కండువా కప్పిన ఎమ్మెల్యే

చీరాల, మే 1 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు గురువారం ఒకే వేదికపై కలుసుకోగా, వారి సంభాషణ నవ్వులు పూయించింది. ఛైర్మన్ జంజనంపై ఎమ్మెల్యే వర్గీయులు అవిశ్వాసం ప్రకటించిన నాటి నుండి చీరాల్లో రాజకీయ పరిస్థితులు వాడీవేడీగా మారాయి. దీంతో రాజకీయ వర్గాల్లో పెద్దఎత్తున చర్చోపచర్చలు సాగాయి. కానీ ఇక్కడి పరిస్థితులు, రాజకీయ సమీకరణాలతో సరదా వాతావరణంలో సాగుతున్నాయి. బుధవారం జంజనం శ్రీనివాసరావు ఎమ్మెల్యే కొండయ్య టీడీపీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ క్రమంలో దాదాపుగా అవిశ్వాస సమావేశంలో ఎమ్మెల్యే వర్గీయుల మద్దతు జంజనంకు ఉంటుందని ఊహాగానాలు వినిపించాయి. అయితే గురువారం మోదీ పర్యటనకు సంబంధించిన జరిగిన విస్తృత సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతుండగా సమావేశంలోకి జంజనం హాజరయ్యారు. ఈక్రమంలో ఓవైపు ఆయన్ను అందరి పలుకరించారు. అలాగే ఎమ్మెల్యే కూడా బాగానే ఆహ్వానించారు. అయితే అక్కడున్న నేతలు, కార్యకర్తలు వారి సమక్షంలో జంజనంకు పార్టీ కండువా కప్పాలని ఎమ్మెల్యేను కోరారు. అంతేకాకుండా అందరికీ వంత పాడుతూ ఛైర్మన్ కూడా లేచి నిలబడి పార్టీ కండువా మెడలో వేయాలని ఎమ్మెల్యేను కోరారు. దీంతో ఒకింత అక్కడ సరదా వాతావరణం నెలకొంది. అలాగే ఎమ్మెల్యే కూడా 'నువ్వు అడిగావంటే..నేనేం వద్దంటానా' అంటూ మెడలో కండువాతో అందరి సమక్షంలో స్వాగతం పలికారు. దీంతో కాస్తంత నవ్వులు పూశాయి. అయితే అనంతరం ఎమ్మెల్యే మాట్లాడిన మాటలు అందరికీ, కంగు తినింపించాయి. ఛైర్మన్‌తో తనకు సమస్యలు లేవుగానీ కౌన్సిలర్ల అవిశ్వాసం అనివార్యమన్నారు. దీంతో తనకు సంబంధం లేదని ఎమ్మెల్యే మాట్లాడడంతో అక్కడున్న వారు విస్తుపోయారు. దీనిని ముందే ఛైర్మన్‌కు వివరించానని, ఎలా జరిగితే అలా జరుగుతుందన్నారు. అందులో ఆక్షేపణ లేదు గానీ, ముఖ్యమంత్రి అభివృద్ధి ప్రణాళికతోనే పార్టీలోకి చేరుతున్నట్లు ఛైర్మన్ ఎమ్మెల్యేకు చెప్పినట్లు అందరికి తెలిపారు. దీంతో అవిశ్వాసం ఎలా జరుగుతుందోనని ఒకింత ఉత్కంఠకు తెర లేపారు. అయితే ఎమ్మెల్యే మాట్లాడుతూ జంజనం ప్రస్థానం టీడీపీతోనేనని, అనేక మంది వైసీపీలో ఉన్న కౌన్సిలర్‌లు కూడా టీడీపీ తాను ముక్కలేనని ఎమ్మెల్యే మాట్లాడారు. వారు తప్పని పరిస్థితుల్లో మునుషులు అక్కడున్నా, మనసులు మాత్రం పార్టీతోనే ఉన్నట్లు వ్యాఖ్యానించారు. త్వరలోనే వారంత సొంత గూటికి చేరుతారని మాట్లాడడంతో అందరిలో ఉత్సాహం నిండింది.


ఛైర్మన్‌కు కండువ కప్పుతున్న ఎమ్మెల్యే

కళాకారుడు మద్దిలేటి మృతి


తోట చినమద్దిలేటి (ఫైల్)

అద్దంకి, మే1 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డులో ఉన్న రవీంద్రభారతీ ఎయిడెడ్ యుపీ స్కూల్ కరస్పాండెంట్, కళాకారుడు తోట చిన మద్దిలేటి(83) గురువారం మృతి చెందారు. అద్దంకి పట్టణంలో 1969లో కాన్వెంట్ ఏర్పాటు చేసిన మద్దిలేటి అనంతరం రవీంద్రభారతీ ఎయిడెడ్ యూపీ స్కూల్‌గా మార్పు చేసి నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మద్దిలేటి గురువారం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మద్దిలేటి మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

పూడికతీత పనుల పరిశీలన


పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్ర

అద్దంకి,మే1 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని 7వ వార్డులో మొండితోకపాలెం నుంచి రామకృష్ణాపురం వరకు ప్రధాన మురుగు కాలువలో ఎస్కవేటర్‌తో పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్ రవీంద్ర గురువారం పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచటంతో పాటు, ఎరువు దిబ్బలు రోడ్ల పై ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు.

చినకొత్తపల్లి సర్పంచికి నోటీసు

అందుబాటులో లేకపోవడంతో ఇంటిగోడకు అతికించిన వైనం

అద్దంకి, మే1 (ఆంధ్రజ్యోతి): దుర్వినియోగానికి గురైన ఎన్ఆర్ఈజీఎస్ నిధులు చెల్లింపునకు సంబంధించి చినకొత్త పల్లి సర్పంచ్ గుజ్జుల మల్లికకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆమె వారం రోజులైన నోటీసును తీసుకోకుండా అందుబాటులో లేకపోవడంతో, గురువారం అధికారులు ఇంటి గోడకు అంటించారు. గత టీడీపీ ప్రభుత్వ హాయంలో గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా సీసీ రోడ్లు, సైడ్‌డ్రైన్ లకు సంబంధించి మెటిరియల్ బిల్ రూ.15,74,823ను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్‌కు చెల్లించకుండా సర్పంచ్ మల్లిక, అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డి సహకారంతో సొంతగా డ్రా చేసి వీరారెడ్డికి చెల్లించారు. ఈ విషయమై అప్పటి నుంచి పోరాటం చేస్తున్న మానం మురళీమోహన్ దాస్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పలు దఫాలుగా విచారించిన అధికారులు నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు గుర్తించారు. దీంతో సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేశారు. అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిని సస్పెండ్ చేస్తూ, బ్యాంక్ నుండి డ్రా చేసిన డబ్బులను వడ్డీతో సహా పంచాయతీ ఖాతా కు జమచేయాలని ఆదేశించారు. క్రిమినల్ కేసు నమోదు చేయాలని కలెక్టర్ వారం రోజుల క్రితం నోటీసులు ఇచ్చారు. అయితే ఆ నోటీసులు తీసుకునేందుకు సర్పంచ్ మల్లిక వారం రోజుల నుంచి కాలయాపన చేయడం, అందుబాటులో లేకపోవటం, రెండు రోజుల నుండి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసిఉంటోంది. దీంతో గురువారం నోటీసును పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, వీఆర్‌వో జ్యోతిరావులు సర్పంచ్ మల్లిక ఇంటిగోడకు అంటించారు.


నోటీసు అంటిస్తున్న అధికారులు

చోరీ కేసులో సొత్తు రికవరీ


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వర్

చీరాల, మే 1 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపిన రూ. కోటికు పైగా బంగారు ఆభరణాలు, నగదు చోరీ ఘటన గురువారంతో సుఖాంతమైంది. అయితే ఈ విషయం గురువారం వెలువడిని సంచికలో 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ వివరాలను వెల్లడించారు. మునిసిపల్ పరిధిలోని నవాబ్‌పేటకు చెందిన షేక్ ఆజాద్, పఠాన్ మునీర్ చెరో రూ.8 లక్షలు వరకు అప్పులు చేశారు. ఈక్రమంలోనే ప్రతాప్ బీఈడీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మువ్వల ప్రసాదరావు ఇంట్లో గత మంగళవారం రాత్రి చోరీకు పాల్పడ్డారు. 125 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షలు నగదు అపహరించారు. ఈక్రమంలో నమోదయిన కేసులో డిఎస్పీ ఎండి మొయిన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సీఐ సూరేపల్లి సుబ్బారావు నిందితులను పట్టుకున్నారు. అలాగే చోరీ జరిగిన పూర్తి సొత్తుతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు సీఐ సుబ్బారావు, ఎస్సై గారపాటి రాజ్యలక్ష్మీ, ఏఎస్సై నాగరాజు, సిబ్బంది శ్రీనివాసరావు, అచ్చయ్య, బాలచంద్ర, బ్రహ్మయ్య, రవూఫ్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు. వారికి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా రివార్డు అందించినున్నట్లు పేర్కొన్నారు.

పండ్ల తోటల పెంపకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చినగంజాం, మే 1(ఆంధ్రజ్యోతి) : మహ్మాతాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకాన్ని రైతులు వినియోగించుకోవాలని డ్వామా పీ.డీ. విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం పండ్ల తోటలు పెంచే రైతులకు కల్పిస్తున్న సదుసాయాలపై గురువారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో రెండు వేల ఎకరాలలో పండ్ల తోటలు పెంచాలని లక్ష్యాన్ని నిర్ణయించినట్లు పీ.డీ తెలిపారు. చినగంజాం మండలలానికి 120 ఎకరాలలో మొక్కలు పెంచాలని లక్ష్యాన్ని ఇవ్వగా ఇప్పటికి పది ఎకరాలు మాత్రమే గుర్తించినట్లు తెలిపారు.

కోలలపూడి గ్రామ అభివృద్ధికి కృషి

ఎంపీ కృష్ణప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు రంజన్

మార్టూరు, మే1 (ఆంధ్రజ్యోతి): రోడ్లు అభివృద్ధికి, గ్రామంలో ప్రజలకు కనీస అవసరాలైన మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తానని బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాద్ అన్నారు. గురువారం ఎంపీ టి.కృష్ణప్రసాద్, పర్చూరు నియోజకవర్గ పరిశీలకులు వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ ఆర్‌కే.రాజన్‌లు మండలంలోని కోలలపూడి గ్రామంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి సర్పంచ్ ఎం. సతీష్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తాటి నాగార్జున, కందిమళ్ల కొండలరావులు స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని అనూరాధ, గోపయ్య, శివ, నందిని, ప్రమీల, హనుమంతరావులకు ఎంపీ, ఛైర్మన్ల చేతుల మీదగా పెన్షన్లు పంపిణీ చేశారు. తరువాత గ్రామం నుంచి ద్రోణాదుల వైపు వెళ్లే నెరేడు కాలువ వద్ద దెబ్బ తిన్న వంతెనను ఎంపీ పరిశీలించారు. దాని మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తానన్నారు. ఇంకా ఎస్సీ కాలనీలో శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీగోడను నిర్మించాలని, అర్హులైన పేదలకు ఇళ్ల మంజూరుచేయాలని తదితర సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సర్పంచ్ ఎంపీకి అందజేశారు. వాటి మంజూరుకు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావుతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


దివ్యాంగుడికి పెన్షన్ అందజేస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్

కూలీలకు వసతుల కరువు

- పనుల వద్ద నీడ, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు నిల్
- ఎండ వేడిమి, ఉక్కపోతతో కూలీల విల విల

బల్లికురవ. మే 1 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండలు ఉక్కపోత రోజురోజుకు పెరుగుతుండడంతో రోజు వారీ కూలీలు విలవిలలాడిపోతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పనులకు వెళ్లే కూలీలకు ప్రభుత్వం కనిస వసతులు కూడా కల్పించడం లేదని కూలీలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పనుల వద్ద నీడ, నీరు అందుబాటులో ఉండేవని ఇప్పుడు ఎక్కడ అలాంటి వసతులు లేవని వారు అంటున్నారు. ఇలానే ఎండలు పెరిగితే పనులకు ముందు మందు వచ్చే పరిస్థితి ఉండదని పలువురు అంటున్నారు.

బల్లికురవ మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో ఉపాధి హమీ పథకం ద్వారా పనులకు కూలీలకు 13 వేల జాబుకార్డులను ప్రభుత్వం అందించింది. ఈ కార్డుల ద్వారా 24 వేల మంది కూలీలకు పనులు కల్పించాల్సి ఉంది. గ్రామాలలో వలస కూలీలకు ఇబ్బందులు లేకుండా పనులు అందుబాటులో ఉన్నాయి. కానీ పనుల వద్ద రోజు వారీ కూలీలకు సరైన వసతులు కల్పించడం లేదు. గతంలో పనులకు వచ్చే కూలీకి నీరు, ఎండ వేడిమి తట్టుకోనేందుకు నీడ నిచ్చే టెంట్లు, ఏదైన గాయాలు అయితే ప్రథమ చికిత్స కోసం కిట్లు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు అలాంటి సౌకర్యాలు పనుల వద్ద లేవు. దీంతో కూలీలు పనులకు వెళ్లి వేసవి ఎండల తాకిడికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోజు వారీగా పనులకు వెళ్లే కూలీలు కొంతసేపు పనులు చేసి ఎండ దెబ్బకు చెట్లుకు పరుగులు పెడుతున్నారు. అదే పనుల వద్దే నీడ ఇచ్చేలా టెంట్లు ఏర్పాటు చేస్తే కూలీలకు రోజు వారీ కూలీ పడుతుందని వారు అంటున్నారు. జాబు కార్డులు ఉన్న ఎలాంటి ఫలితం లేదని కొందరు కూలీలు అంటున్నారు. ఉపాధి పనులు అంటే భయమేస్తుందని వారు అంటున్నారు. కొండ ప్రాంతాలలో పనులు చేయిస్తున్నారని అక్కడ తాగు నీరు కూడా అందుబాటులో ఉండటం లేదని అందుకే పను లకు వెళ్లటం లేదని కొందరు కూలీలు అంటున్నారు. పంట కాలువలు పనులు చేసే సమయంలో ఉక్క పోత తో పనులు చేయలేక అక్కడే ఎండలో సేద తీరుతు న్నామని కూలీలు తెలిపారు. అధికారులు మాత్రం ఈ ఏడాది కూలీలకు ఎలాంటి సౌకార్యలు కల్పించేలా ఉత్తర్వులు రాలేదని అంటున్నారని కూలీలు తెలిపారు.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

నాలుగు రోజుల క్రితం కూలీ మృతి

మండలంలోని కొండాయపాలెం గ్రామంలో ఉపాధి పనులు చేస్తూ, ఎండల దెబ్బకు రోజువారీ కూలీ తన్నీరు శ్రీనివాసరావు అస్వస్థతకు గురై వైద్యశాలలో చికిత్స పొందుతు మృతి చెందా డు. ఉపాధి పనుల వద్ద కనీస వసతులు లేకపోవడం వలనే ఇలాంటి పరిస్థితి వచ్చిందని పలువురు కూలీలు అంటున్నారు.

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	38.5	28.8
కావలి	36	29
ఆత్మకూరు	40	27
ఉదయగిరి	39	28
కందుకూరు	37	29

కార్మికులతో కలిసి అడుగులో అడుగేస్తూ..

ఆప్యాయంగా పలకిస్తూ..



ప్రజలతో మమేకమవుతూ... వారితో మాటామంతీ కలుపుతూ.. కష్టసుఖాలు తెలుసుకుంటూ.. నేనున్నానంటూ భరోసా ఇస్తూ.. ఇలా గతానికి భిన్నంగా ఆత్మకూరులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సాగింది. తనను చూసేందుకు వచ్చిన కార్యకర్తలు, ప్రజలను పిలిచి మరీ సెల్ఫీలు తీసుకున్నారు. నెల్లూరుపాళెం గిరిజన కాలనీలో సీఎం చంద్రబాబు ప్రజలకు అభివాదం చేస్తూ హుషారుగా, ఉల్లాసంగా ముందుకు సాగారు. బాలబాలికలతో ముచ్చటించారు. గిరిజన కుటుంబాలతో సెల్ఫీలు, ఫొటోలు దిగారు. వారి కష్టసుఖాలను తెలుసుకుంటూనే అన్నిటినీ నెరవేర్చుతానని భరోసా ఇచ్చారు. సాక్షాత్తు ముఖ్యమంత్రే స్వయంగా తమ కాలనీకి రావడం, ఆప్యాయంగా పలకరించడంతో గిరిజనుల్లో ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

సీఎం: ఏంటమ్మ నీ పేరు

గిరిజన యువతి : జ్ఞానమ్మ సార్!

సీఎం : నీ కుటుంబం పరిస్థితి ఏమిటీ ? పొలంకాని, ఆస్తికాని ఉందా ?

జ్ఞానమ్మ : సార్.. నాకు నలుగురు పిల్లలు.. మేము నిరుపేదలం. మాకు ఇల్లు వాకిలీ లేదు. నాభర్త కూలికి పోతేనే జీవనాధారం. మాకు ఇల్లు ఇప్పిస్తే తలదాచుకుంటాం. ఏ ఆధారం లేదు సార్.. ఎవరూ అప్పు కూడా ఇవ్వడం లేదు. పిల్లలను బాగా చదివించుకోవాలన్నది మా కోరిక సార్ (ఏడుస్తూ)

సీఎం : ఆ నలుగురు పిల్లలను కుటుంబ ఆస్తిగా మార్చాలి. అందుకే వారిని బాగా చదివిస్తే అందరికన్నా బాగా రాణిస్తారు. ఈ కుటుంబాన్ని దత్తత తీసుకునే వ్యక్తితో మాట్లాడుదాం.

సీఎం : తమ్ముడూ ఈ కుటుంబాన్ని ఎలా ఆదుకుంటావు?

నాగేశ్వరరావు : నమస్తే సార్.. నా పేరు నాగేశ్వరరావు. పిల్లలను బాగా చదివించేందుకు తోడ్పాటు అందిస్తా. ప్రభుత్వ పథకాలు అందించి ఆర్థికంగా ఎదిగేందుకు చేయూతనిస్తా సార్..

సీఎం : సరే.. ఒక్కొక్కరికి లక్ష రూపాయలు డిపాజిట్ చేస్తా. మీరు అక్కడ నుంచి ఆ కుటుంబానికి ఏం చేస్తే అభివృద్ధిచెందుతారో దృష్టి సారించడండి. మీ పిల్లలను ఎలా అభివృద్ధి చేస్తారో అలాగే వీరినీ చేయండి.

● పంథా మార్చిన సీఎం చంద్రబాబు ● పాలనతోపాటు పార్టీకి ప్రాధాన్యం

ప్రభుత్వాధినేతగా పాలనావ్యవహారాలు ఎన్ని ఉన్నా వాటికి సమాంతరంగా కార్యకర్తల కలయికకు సమ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమాల కోసం ఏ జిల్లాకు వెళ్లినా అక్కడి కార్యకర్తలతో మమేకం అవుతున్నారు. గురువారం ఆత్మకూరు కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు ఈ విషయాన్ని ప్రకటించారు. 'ఇంతకు ముందు వరకు నేను ప్రభుత్వ కార్యక్రమాలను చూసుకొని వెళ్లిపోయేవాడిని. కార్యకర్తలను కలిసేవాడిని కాను. దీనివల్ల రాజకీయంగా కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. అందుకే ఇకపై నేను అధికార పర్యటన నిమిత్తం వచ్చినా తప్పనిసరిగా ఆ ప్రాంతాల కార్యకర్తలను కలుస్తాను. వారితో కొంతసేపు గడుపుతాను.. వారి కష్టాలను, భావాలను, సలహాలను, సూచనలను తీసుకుంటాను' అని చంద్రబాబు పేర్కొన్నారు. 1984-85 నుంచి 1999 వరకు చంద్రబాబు పార్టీ కార్యకర్తల మధ్యే నలిగారు. అప్పట్లో ఆయన మాటంటే కార్యకర్తలకు, నాయకులకు ఒక నమ్మకం. ఎప్పుడైతే ముఖ్యమంత్రి అయ్యారో ఆ రోజు నుంచి కార్యకర్తలకు ఆయనకు మధ్య దూరం పెరిగింది. విజనరీ ముఖ్యమంత్రిగా అంతర్జాతీయ స్థాయి వరకు ఆయనకు గుర్తింపు పెరిగింది కానీ, అంతేస్థాయిలో సామాన్య కార్యకర్తలతో ఆయనకు దూరం పెరిగింది. దీనివల్ల రాజకీయంగా ఆయనకు జరగాల్సిన నష్టం జరుగుతూనే వచ్చింది. ఇన్నాళ్లకు ఆయన ఈ విషయాన్ని గుర్తించారు. చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం పార్టీకి మంచి చేస్తుందని, ఆ పార్టీ సీనియర్లు నమ్ముతున్నారు.



ప్రజలకు అభివాదం చేస్తూ..

● మరోవైపు కాలనీలో సుస్మిత అనే గిరిజన యువతి ఇంటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను సీఎం చంద్రబాబు అందజేశారు. సుస్మిత తల్లిదండ్రులు అంకోజి, సుమ, సోదరుడితో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. సుస్మిత కుమార్తె చైత్రికతో కరచాలనం ఇవ్వడంతో వాళ్ల సంతోషానికి అవధులు లేవు.

● ఆ తర్వాత ప్రజావేదికపై మార్గదర్శి బంగారు కుటుంబాలను అనుసంధానం సందర్భంగా జ్ఞానమ్మ కుటుంబసభ్యులతో సీఎం మాట్లాడిన, మాట్లాడించిన తీరు హర్షదాయకం. జ్ఞానమ్మ చిన్న కుమార్తెను ముఖ్యమంత్రి తన చేతులతో ఎత్తుకోవడం అబ్బురపరిచింది.

● నెల్లూరుపాళెం వద్ద ఆంధ్ర ఇంజనీరింగ్ కాలేజీ ఎదుట నిర్మాణంలో ఉన్న ఓ కల్యాణమండపం వద్దకు ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లారు. అక్కడ పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడి వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలను సావధానంగా విన్నారు. సెంట్రింగ్ పనులను పరిశీలించడం, పార తీసుకుని తట్టలకు కంకర ఎత్తడం కార్మికుల్లో సంతోషం నింపింది.

\- నెల్లూరు/ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి)

నెల్లూరుపాళెం వద్ద ఓ కల్యాణమండపం వద్ద రోజువారి కూలీలతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



గిరిజనుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తూ..

జ్ఞానమ్మ కుటుంబంతో..



టీడీపీ శ్రేణులనుద్దేశించి మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



మర్రిపాడు మండలానికి చెందిన జ్ఞానమ్మతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

మీరూ కష్టపడి పని చేయండి!

పాత, కొత్తవారితో కలిసి పని చేయండి

టీడీపీ కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు

మీ గౌరవం కాపాడుతా!

ఆత్మకూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): 'గ్రామాల్లో మీ గౌరవం కాపాడుతా. మీరు గుర్తించిన ప్రజాసమస్యలను పరిష్కరిస్తా. ప్రజలు మీ నాయకత్వాన్ని గుర్తించేలా, గౌరవించేలా చేసే బాధ్యత నాది. మీరు పార్టీ కోసం కష్టపడండి. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించండి. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారితో కలిసి పని చేయండి. టీడీపీలో వర్గాలకు తావులేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ నేను వాటిని ఎంకరేజ్ చేయను.' అని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆత్మకూరు నియోజకవర్గ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఆత్మకూరు పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం ఆయన నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. సభ్యత్వ నమోదులో బాగా పనిచేసిన క్లస్టర్ ఇన్‌చార్జులను పేరుపేరున అభినందించారు. సహచర కార్యకర్తల కరతాళ ధ్వనుల ద్వారా వారిలో కొత్త ఉత్సాహం నింపారు. కార్యకర్తల కోసం తెలుగుదేశం పార్టీ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చంద్రబాబు వివరించారు. కార్యకర్తలకు ప్రమాద బీమా కింద రూ. 5 లక్షలు అందిస్తున్న ఏకైక రాజకీయ పార్టీ టీడీపీ అంటూ వివరించారు. కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీలో ఇచ్చినంత విలువ, గౌరవం మరే పార్టీలోనూ ఉండవని స్పష్టం చేశారు. కార్యకర్తలందరూ న్యూ ట్రబుల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, దాని ద్వారా మీ ఆరోగ్యాన్ని కూడా నేరుగా పర్యవేక్షించే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే 4 లక్షల మందికిపైగాఈ యాప్‌ను వినియోగిస్తున్నట్లు చెప్పారు. పార్టీలో ఇంకా పాత కొత్త భేదాలు కనిపిస్తున్నాయని, అందరినీ సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని చంద్రబాబు సూచించారు. ప్రజా సర్వేలో కూటమి ప్రభుత్వం పనితీరుపైన, సంక్షేమ పథకాల పైన 79 శాతం సంతృప్తి వ్యక్తం అవుతోందని, సోషల్‌మీడియా వాడుకలో నియోజకవర్గం ఇంకొంత మెరుగుపడాలని సూచించారు.

నెల్లూరు అభివృద్ధికి నాదీ బాధ్యత!

త్వరలో ఎయిర్‌పోర్టు పనులు

ఆత్మకూరులో ఇంజనీరింగ్ కాలేజీ

సోమశిల జలాలతో దప్పిక తీరుస్తాం

ప్రజావేదికలో సీఎం చంద్రబాబు

నెల్లూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : 'తెలుగుదేశం పార్టీ నెల్లూరు జిల్లాకు చాలా చేసింది. తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను తీసుకొచ్చిన మహనీయుడు ఎన్టీ రామారావు. కండలేరు ప్రాజెక్టును నిర్మించింది కూడా ఆయనే. గత ఎన్నికల్లో పదికి పది స్థానాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించారు. నెల్లూరు జిల్లా అభివృద్ధి నా బాధ్యత' అని సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గురువారం ఆత్మకూరులో పర్యటించిన సందర్భంగా ప్రజా వేదికపై పలు హామీలు ఇచ్చారు. రామాయపట్నంలో రూ.95 వేల కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ పరిశ్రమ ఏర్పాటు జరుగుతోందని తెలిపారు. త్వరలోనే దగదర్తి విమానాశ్రయం పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రెండు పోర్టులు, ఒక ఎయిర్ పోర్టు, జాతీయ రహదారులు, రైల్వే లైన్లు, నీటి వనరులతో నెల్లూరు జిల్లా అభివృద్ధికి పుష్కల అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ అవకాశాలను యువత అందింపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. క్రిస్ సిటీ పనులు వేగంగా జరుగుతున్నాయని, శ్రీసిటీలో రూ.5 వేల కోట్లతో ఎల్‌జీ పరిశ్రమ వస్తోందని వెల్లడించారు. దీనిద్వారా 10 వేల ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. ఆత్మకూరులో ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించారు. సోమశిల నీటిని ఆత్మకూరుకు తీసుకొచ్చే బాధ్యతను తీసుకుంటామని స్పష్టం చేశారు. నారంపేటలో పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం ఉందని, ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటైతే ఈ ప్రాంత రూపురేఖలు మారుతాయని పేర్కొన్నారు.





ప్రజావేదికలో జనాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, వేదికపై మంత్రులు ఆనం, ఫరూక్, భరత్, ఎంపీ వేమిరెడ్డి, కలెక్టర్ ఆనంద్ తదితరులు



నెల్లూరు నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు, కార్మికులు

ఎరజెండ.. ఎరజెండ ఎన్నియల్లో...

ఘనంగా మేడే

కార్మిక దినోత్సవం మే డేను గురువారం జిల్లా వ్యాప్తంగా శ్రామికులు ఘనంగా జరుపుకున్నారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రదర్శనలు, జెండా ఆవిష్కరణలు జరిగాయి. కార్మికుల హక్కుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరును నాయకులు ఎండగట్టారు. కార్మిక హక్కుల పరిరక్షణకు మరిన్ని పోరాటాలు సాగిస్తామని ప్రకటించారు.

వివరాలు లోపలి పేజీల్లో...



8 నుంచి కోనలో బ్రహ్మోత్సవాలు

● 14 వరకు నిర్వహణ
● ఏర్పాట్లలో అధికారులు
● ఇప్పటికే అధికారులతో సమీక్ష

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : పెంచల కోనలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ఈ మేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయ ఉత్సవ కమిటీ ఏర్పాటు కాగా, చేయాల్సిన పనులపై ఇటీవల నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష అధికారుల దిశానిర్దేశం చేశారు.

ఈ నెల 8న గోనెపల్లి నుంచి కోనకు ఉత్సవ మూర్తుల రాక, అంకురార్పణ, సేనాధిపతి ఉత్సవం, 9న తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణ, శేష వాహన సేవ జరుగుతంది. 10న హంస వాహనం, స్వర్ణ, హనుమంత సేవ, 11న సింహ వాహనం, నృసింహ జయంతి, స్వర్ణ గరుడసేవ జరుగుతుంది. 12న శ్రీవారి కల్యాణం, రథోత్సవం, గజ వాహనంపై స్వామి వారి విహరిస్తారు. 13న వసంతోత్సవం, చక్రస్నానం, తెప్పోత్సవం, అశ్వా హనసేవ, ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయి. 4న గోనుపల్లిలో స్వామివారికి గ్రామోత్సవం ఉంటుంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	117
స్కిన్ చికెన్	212
స్కిన్‌లెస్	232

కోడిగుడ్ల ధర (100) : 445

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9059
వెండి కిలో ధర	రూ. 96.500
వెండి ఒక గ్రాము	రూ.99.50

నర్సింగ్ వృత్తి సేవాభావంతో చేపట్టాలి

కందుకూరు, మే 1(ఆంధ్రజ్యోతి): నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఈ వృత్తిని ఎంచుకునే ప్రతిఒక్కరూ సేవాభావంతో ముందుకుసాగాలని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్‌శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ఉన్న సరోజినీదేవి నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ కోర్సు మొదటి సంవత్సరం ప్రారంభం సందర్భంగా గురువారం నిర్వహించిన జ్యోతిప్రజ్వలన కార్యక్రమంలో విజయ్‌శ్రీనివాస్, కె.ఇంద్రాదేవి దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వి.హరిబాబు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

'బాపట్ల' పరిశీలకుడిగా ఎమ్మెల్సీ తూమాటి

కందుకూరు, మే 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ బాపట్ల పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడిగా ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు నియమితులయ్యారు. కందుకూరు నియోజకవర్గానికి చెందిన మాధవరావుకు బాపట్ల పార్లమెంటు పరిశీలకుని బాధ్యతలు అప్పగిస్తూ పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి నిర్ణయం తీసుకోవడంతో గురువారం ఆయన తాడేపల్లిలో జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయ ఏవో మృతి

బిట్రగుంట, మే 1(ఆంధ్రజ్యోతి): బోగోలు ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలనాధికారిగా పని చేస్తున్న రేవూరు గోవిందరావు (53) గురువారం మృతి చెందారు. ఈయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన మృతికి కార్యాలయ సిబ్బంది, స్థానికులు సంతాపం తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన స్వగ్రామమైన అల్లూరులో అంత్యక్రియలు జరుగనున్నాయి.

బిట్రగుంటలో సంబరాలు

బిట్రగుంట, మే 1(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే స్టేషన్లో ఎత్తివేసిన రిజర్వేషన్ కౌంటర్ పునఃప్రాంభం కానుండడంతో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరాజులు, బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్.నూరుద్దీన్‌ల ఆధ్వర్యంలో గురువారం సంబరాలు జరుపుకున్నారు. స్థానిక రైల్వే అధికారులకు, సిబ్బందికి మిఠాయి పంపిణీ చేశారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ

ఉలవపాడు, మే 1(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని గ్రంథపాలకుడు డీ కోటేశ్వరరావు చెప్పారు. గురువారం ఉలవపాడులోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించారు. విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ కూల్‌డ్రింక్స్ పంపిణీ చేశారు.

బోగోలులో ఉరుములు, మెరుపులు

బిట్రగుంట, మే 1(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లగా మారింది. ఉదయం నుంచి వేసవి విష్ణోగ్రత తీవ్రంగా ఉండగా ఒక్కసారిగా మార్పు రావడం, చల్లగాలులు వీచడంతో ప్రజలు సేదతీరారు.



కావలిటౌన్ : మేడే వేడుకల్లో టీఎన్‌టీయూసీ కార్మికులతో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



కందుకూరు : కార్మిక జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు



కావలి : ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

నాడు నేనూ వ్యవసాయ కార్మికుడినే..

● మేడే వేడుకల్లో ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి

కావలిటౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు తానూ వ్యవసాయ కార్మికుడిగా కష్టపడి పనిచేసుకుంటూ అంచెలంచెలుగా ఎదిగి ఎమ్మెల్యే స్థాయికి చేరుకున్నానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి గుర్తు చేసుకున్నారు. మేడే సందర్భంగా గురువారం వాడవాడలా ఎర్ర జెండా రెపరెపలాడింది. టీఎన్‌టీయుసీ, భవన నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ఎర్ర జెండా ఎగురవేశారు. లతా థియేటర్ వద్ద భవన నిర్మాణ కార్మికసంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికులందరూ గ్రూపులుగా ఏర్పడి ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. తాను కార్మికులకు కాపుకాసే కార్మికుడిగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, హరిబాబు, అమ రా వేదగిరి, పోట్లూరి శ్రీనివాసులు, శానం హరి తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ డిపో వద్ద టీఎన్‌టీయుసీ అధ్యక్ష కార్యదర్శులు శాంతి, మహేంద్రల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జ్యోతి బాబురావు, కండ్లగుంట మధుబాబునాయుడు, తటవర్తి వాసు, తిరివీధి ప్రసాద్, దేవ, సూరి పాల్గొన్నారు.

● సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ట్రంకురోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు రెహెనా బేగం ఎర్ర జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పెంచలయ్య, కార్యదర్శి కృష్ణమోహన్, ఆశా వర్కర్లు, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

● ఆటో యూనియన్లు ఆయా కూడళ్లలో జెండా ఆవిష్కరించి మిఠాయిలు పంచిపెట్టారు.

● టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా రైతు బజారు వద్ద గుడ్డ సంచులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, నాయకులు పెంచలయ్య, వేణు, జమీర్, హ్యాపీ సేవాసంస్థ అధ్యక్షుడు సయ్యద్ ఘనీబాషా తదితరులు పాల్గొన్నారు.

కావలి : మేడే సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మిక జెండాను రైతు సంఘం జిల్లా నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లి అంకయ్యలతో కలసి ఏఐటీయూసీ జిల్లా జాయింట్ సెక్రటరీ రాజగోపాల్ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు తన్నీరు, వెంకటేష్, ఆదినారాయణ, వై.రవి, దమ్ము దర్గాబాబు, పద్మావతి పాల్గొన్నారు.

● కావలి డివిజన్ బైక్‌మెకానిక్‌ల అసోసియేషన్ ఆధ్వర్యంలో బైక్ మెకానిక్‌లు పట్టణంలో మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ నాయకులు రఫీ, బాబుల ఆధ్వర్యంలో జరిగిన ఈర్యాలీ కావలిపట్టణ జెండా చెట్టు వద్ద నుంచి ముసునూరు టీచర్స్‌కాలనీ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అన్వర్ బాషా మాట్లాడారు.

కందుకూరు : ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భగా కందుకూరులో సీపీఐ, ఏఐటీయూసీ, సీపీఎం, సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీపీఐ కార్యాలయంలో ఆపార్టీ జిల్లా సహాయకార్యదర్శి పోకూరి మాలకొండయ్య జెండా ఆవిష్కరించారు. పార్టీ దివంగత నేతలు నవడారెడ్డి, వలేటి రాఘవులు స్థూపాల వద్ద, కోటారెడ్డి ఆసుపత్రి సెంటర్‌లో పెయింట్స్‌వర్కర్స్ యూనియన్, బండ్లమిట్ట సెంటర్‌లో టైల్స్‌వర్కర్స్ యూనియన్, మున్సిపల్ కార్యాలయం, ఏరియా ఆసుపత్రిలో, నాంచారమ్మ కాలనీ, ప్రశాంతినగర్ కాలనీలలో సీపీఐ కార్మిక జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయాసంఘాల నాయకులు బీ.సురేష్‌బాబు, మురళీ, ఆనంద్‌మోహన్, ఎస్‌కే హుస్సేన్, నత్తా రామారావు, డి.ఆదినారాయణ, ఎం.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అలాగే ఆటో వర్కర్స్, కారు వర్కర్స్ యూనియన్ కార్యాలయాల వద్ద, కోవూరు రోడ్డు, గవర్నమెంటు ఆసుపత్రి, కోటారెడ్డి ఆసుపత్రి సెంటర్లలో కార్మిక పతాకాలు ఆవిష్కరించారు. పట్టణంలో ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఎస్‌డబ్ల్యూఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు ఎం.నరసింహం, సన్యాసి మహేష్, చెంచురామయ్య, డీ.రమణయ్య, హరికోటేశ్వరరావు, అశోక్, కరీం, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా పోరాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మేడే సందర్భగా లింగసముద్రం, పెదపవని గ్రామాల్లో సీఐటీయూ జెండాను భవన నిర్మాణ కార్మికులు, అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లుతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ లీడర్లు రమాదేవి, సుగుణ, మధులత, భవన నిర్మాణ కార్మికులు షేక్ హజరత్, సురేష్, నాట్యమండలి గాయకుడు మన్నం రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : మండలంలోని పలు గ్రామాల్లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వలేటివారిపాలెంలో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో మండల సీపీఎం కార్యదర్శి మాదాల రమణయ్య, చెర్లోపాలెంలో మాజీ ఎంపీపీ బూసి అనసూయమ్మ, బడేవారిపాలెం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త పొనుగోటి భారతి జెండా ఆవిష్కరించారు. నాయకులు కుమార్, మాధవరావు, సాధు చెన్నకేశవులు, జక్రయ్య పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలం ఇబ్రహీంపేటలోని సీపీఎం కార్యాలయ ఆవరణలో మండల సీనియర్ నాయకుడు తుమ్మల వెంకయ్య ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అన్వర్‌బాషా, రామయ్య, మేరీ, భవన కార్మిక సంఘ నేతలు శ్రీనివాసులు, బాదుల్లా, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

జలదంకి : జమ్మలపాలెంలో వ్యవసాయకూలీ సంఘం, సీఐటీయూ, ఆటోవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి పక్కన ఎర్రజెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడపాల సురేష్ పాల్గొన్నారు.

బీద లక్ష్మానంద్‌కు రెడ్‌క్రాస్ జాతీయ పురస్కారం



కావలి, మే 1(ఆంధ్రజ్యోతి): కావలి రెడ్‌క్రాస్ వలంటీర్, విపత్తు నిర్వహణ శిక్షకుడు, రక్తదాన ప్రేరేపికుడు బీద లక్ష్మానంద్ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. గత 12 ఏళ్లుగా రెడ్‌క్రాస్‌లో వివిధ రంగాలకు సేవలందిస్తున్న లక్ష్మానంద్ బోగోలు మండలం బిట్రగుంట గ్రామ సచివాలయ సర్వేయర్‌గా పనిచేస్తున్నారు. 2012లో కావలి విశ్వోదయ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నప్పుడు రెడ్‌క్రాస్‌కు పరిచయమై వలంటీర్‌గా మారి అప్పటి నుంచి సేవలందిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి 2023-24 సంవత్సరానికి గాను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

కొలతల ప్రకారం పని చేయాలి

లింగసముద్రం, మే 1(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనులకు ఉదయం 6 గంటలకు వచ్చి కొలతల ప్రకారం పనులు చేస్తే ప్రభుత్వం నిర్ధేశించిన కూలి డబ్బులు వస్తాయని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన మండలంలోని చినపవని, అన్నెబోయినపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీలకు పలు సూచనలు చేశారు. అనంతరం మండలంలో పలు గ్రామాలలో జరుగుతున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని పరిశీలించారు. చినపవని గ్రామంలో పలువురు లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లను అందజేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి షేక్ రషీద్‌బాషా, టీఏ జీ.రాఘవ ఉన్నారు.

దేశంలోనే అతిపెద్ద సంక్షేమం పథకం

'ఎన్టీఆర్ భరోసా' : ఎమ్మెల్యే కాకర్ల

జలదంకి, మే 1(ఆంధ్రజ్యోతి): భారతదేశంలోనే పేదలకు అందించే సంక్షేమ పథకాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం అతి పెద్దదని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని జమ్మలపాలెంలో గురువారం ప్రభుత్వ సిబ్బందితో కలసి ఆయన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు వృద్ధులు, వితంతులవులకు రూ.4వేల, దివ్యాంగులకు



వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

రూ.6వేల వంతున ప్రతి నెలా లక్షలాదిమందికి అందిస్తున్నారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదికి రూ.250 వంతున పెంచి ఐదేళ్లకు రూ.1000 చేస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒకేసారి రూ.1000 పెంచిందన్నారు. దివ్యాంగులకు జగన్ హయాంలో ఇచ్చిన రూ.3000ను చంద్రబాబు రూ.6000 చేశారన్నారు. ఈ సందర్భంగా పలువురు అర్హులైన లబ్ధిదారులు తమకు పింఛన్ ఇప్పించాలని ఎమ్మెల్యేని కోరగా అర్హులందరికీ పార్టీలకతీతంగా పింఛన్ వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మయ్య, సర్పంచు బుర్రి శ్రీవేణి, నాయకులు మధురెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాధవరావు, ఖాజావలి, మనోజ్, రామారావు, కొండపనాయుడు పాల్గొన్నారు.

అల్లూరు : మండలంలో జరిగిన ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రాయి నాయుడు, పాపనబోయిన జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : మండలంలోని పోకూరు, శాఖవరం గ్రామ సచివాలయాల్లో పంపిణీ చేస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ నరేంద్రదేవ్ పరిశీలించి లబ్ధిదారులకు స్వయంగా పంపిణీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొండాపురం : మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 95శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ ఆదినారాయణరావు తెలిపారు. గుడవల్లూరులో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సర్పంచు బద్దిపూడి మాచర్ల, మాజీ వైస్‌ఎంపీపీ పోలినేని చంద్రబాబునాయుడు, ఈఓపీఆర్డీ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

మాధవరావు కుటుంబానికి పరామర్శ

వలేటివారిపాలెం, మే 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అత్తింటివారిపాలెంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ కొల్లూరి మాధవరావు కుటుంబ సభ్యులను కందుకూరు నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ గురువారం పరామర్శించారు. మాధవరావు తండ్రి నరసయ్యతో పాటు, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైసీపీ మండల కన్వీనర్ అనుమోల లక్ష్మీనరసింహం, నాయకులు నల్లమోతు చంద్రమౌళి, గుత్తా గోపి, ప్రగడ సుధాకర్, నరసింగ రావు, నరసయ్య, మర్రి అంజయ్య, తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీడీపీవో సునీత

సీతారామపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహలను ఆరికట్టాలని సీడీపీవో సునీత అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే ముఖ్యంగా పలు సమస్యలు ఎదుర్కొంటారన్నారు. ఈ కార్యాక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో భార్గవి, ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ తేజస్విని, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశావర్కర్లు , తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

సంగం, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 2025 - 26 విద్యా సంవత్సరానికి చేరేందుకు అర్హత కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏడుకొండలు ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు 24వ తేదీ వరకు ఐటీఐ, ఏపీ.జీవోవి.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. సంగం ఐటీఐలో ఎలక్ట్రీషియన్‌లో 40, ఫిట్టర్‌లో 40 సీట్లు ఉన్నాయన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. మిగతా వివరాలకు 9866720544, 9963950604 నంబర్లను సంప్రదించవచ్చునని తెలిపారు.

సీతారాములకు ప్రత్యేక పూజలు

దుత్తలూరు(ఉదయగిరి), మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమలరేగడ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామస్వామి దేవస్థానంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితులు స్వామివార్లకు ఆదిత్యాది నవగ్రహారాధన, వాస్తుదేవతారాధన, దీక్షాహోమాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చలివేంద్రం ప్రారంభం

సీతారామపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ వద్ద మండల ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ బాబు ఆధ్వర్యంలో గురువారం మండల టీడీపీ నాయకుడు చింతల శ్రీనివాసులు చేతుల మీదుగా చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ్య, చంద్రరెడ్డి, బూత్ ఇన్‌చార్జ్ తోట మాల్యాద్రి, వార్డు మెంబర్ మనోజ్, మండల టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యవసాయ శాఖ ఏడీ మృతి

వింజమూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న ఎన్ రామిరెడ్డి గురువారం గుండెపోటుతో మృతిచెందారు. సుమారు 25 సంవత్సరాలుగా వ్యవసాయ శాఖలో వివిధ హోదాలలో రామిరెడ్డి అందించిన సేవలను మర్చిపోలేమని పలువురు రైతులు తెలిపారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

సీతారామపురం, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో 14 పంచాయతీలలోని ప్రతి గ్రా మంలో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సచివాలయ సిబ్బందితో కలిసి టీడీపీ నాయ కులు ఇంటింటికి తిరిగి అందజేశారు. పోకలవారిపల్లి గ్రామంలో మండల టీడీపీ నాయకుడు చింతల శ్రీనివాసులు సచివాలయ సిబ్బందితో కలిసి వితంతులకు పెన్షన్ పంపిణీ చేశారు.



వితంతు పింఛన్ అందజేస్తున్న మండల టీడీపీ నాయకుడు చింతల శ్రీనివాసులు

వాడవాడలా మేడే సంబరాలు



ఆత్మకూరు : జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు, కార్మికులు



ఉదయగిరిలో మేడే వేడుకలు నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

ఆత్మకూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీపీఎం, సీఐటీయు, ఏఐటియుసి, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం మేడే వేడుకలు నిర్వహించారు. స్థానిక ఎల్ఆర్‌పల్లి, చావిడి సెంటర్, ఆర్టీసీ డిపో ఆవరణలో, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల సమీపంలో, మున్సిపల్ బస్టాండ్ సెంటర్, పడమటివీధి, ఏకలవ్యనగర్, పెద్దమసీదు తదితర సెంటర్లలో సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు డేవిడ్‌రాజు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ సందాని, ఆత్మకూరు నాగయ్య, సాలారుద్దీన్, నాగేంద్ర, సిఐటియు, యూటిఎఫ్ నాయకులు జి శివప్రసాద్, లక్కు ప్రసాద్, వాగాల శ్రీహరి, హజరత్తయ్య, ప్రజా నాట్య మండలి ప్రముఖ కళాకారుడు గద్దర్‌బాబు, సీఐటీయు, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు షేక్ హయ్యాత్‌బాష, మహమ్మదాలీ తదితర నేతలు జెండాలు ఆవిష్కరించారు. పట్టణంలో మేడే సందర్భంగా ఏఐటీయుసీ, మున్సిపల్ వర్కర్స్ ఆటోయూనియన్ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయుసీ, సివిల్ సప్లయ్ కార్మికుల నాయకులు పాల్గొన్నారు.

● ఏఎస్ పేట : ఏఎస్ పేటలో గురువారం కార్మిక దినోత్సవం సిపిఎం మండల కార్యదర్శి మొగల్ నిస్సార్ అహమ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంటా లక్ష్మిపతి, షేక్ దిలియాజ్, డీసీ వెంగయ్య, గయాజ్, సయ్యద్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

●సంగం : మండల కేంద్రమైన సంగంలో కార్మిక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయంలో ఎలక్ట్రికల్ సిబ్బంది, బస్టాండ్ సెంటర్‌లో ఆటో కార్మికులు జండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

●అనంతసాగరం : మండల కేంద్రమైన అనంతసాగరంలో గురువారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ర్యాలీ చేపట్టారు. జెండా ఆవిష్కరణలో సీపీఎం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

● ఉదయగిరి : పట్టణంలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో మేడే సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య భవనం, పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే కుర్రపల్లి, గండిపాళెం గ్రామాల్లో మేడే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఫరుద్దీన్, కోడె రమణయ్య, కామాక్షమ్మ, నాగేశ్వరరావు, నాయబ్, యస్థాని, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) : స్థానిక విద్యుత్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే సంబరాలను ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి మట్టె హరినారాయణ, అధ్యక్షుడు వై రమణారెడ్డి, నాయకులు ఓబయ్య, జీ.ఏసు, వై.చెన్నకేశవులు, పలు శాఖల ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పత్తికి నీరు విడుదల

లింగసముద్రం, మే 1(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి పత్తి పంటకు శుక్రవారం నుంచి నీరు విడుదల చేయాలని ప్రాజెక్టు ఆయకట్టు సంఘం చైర్మన్, ఆయకట్టు సంఘాల ప్రతినిధులు, అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు గురువారం కందుకూరులోని రాళ్లపాడు ప్రాజెక్టు ఈఈ కార్యాలయంలో ఆయకట్టు సంఘం చైర్మన్ ఏలూరి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తీర్మానించారు. శుక్రవారం ఉదయం నుంచి ఈనెల 8వ తేదీ వరకు కుడి కాలువ ద్వారా నీరు విడుదల తీర్మాన ప్రతిపాదనను ఈఈ మునిరత్నంకు నివేదించారు. దీంతో కుడి కాలువ నుంచి 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని ఈఈ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రాజెక్టు డీఈ ఎం.వెంకటేశ్వర్లు, ఏఈలు జీ.చంద్రమౌళి, మనోహర్, చీమలపెంట, పూరేటిపల్లి, శాయిపేట, బసిరెడ్డిపాలెం, చినపవని ఆయకట్టు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కుక్కలు, కోతుల స్వైర విహారం

● గ్రామస్థుల బెంబేలు

మర్రిపాడు, మే 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కుక్కలు, కోతుల స్వైర విహారంతో గ్రామస్థులు బెంబేలెత్తిపోతున్నారు. మర్రిపాడు మండల కేంద్రానికి 3 కిలోమీటర్ల దూరంలో వెలుగొండ అడవులు ఉండడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లోని కుక్కలు, పొలాల్లోని కోతులను పట్టి అడవి ప్రాంతంలో వదదిలేసి వెళ్తుం టారు. అవి గ్రామాల్లోకి ప్రవేశించి బీభత్సం సృష్టిస్తున్నాయి. ఉదయం ఆరు గంటల నుంచే ఒక్కసారిగా కోతులు నివాసాల్లోకి ప్రవేశిస్తుండటంతో బెంబేలెత్తిపోతున్నారు. వాటి బారి నుంచి తప్పించుకునేందుకు కొందరు అధిక మొత్తంలో ఖర్చు చేసి ఇళ్లకు ఇనుప తడికెలను ఏర్పాటు చేసుకుంటున్నారు. బస్టాండ్ సెంటర్‌లో సరుకులు తీసుకెళ్తున్న వారి మీద పడి చేతుల్లో సంచులను లాక్కెళ్తున్నాయి. అలాగే కుక్క లు వీధుల వెంబడి గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడిచేసి గాయపరుస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మండల కేంద్రంలో ఒకే కుక్క 12మందిని కరిచి గాయపరిచిందని, దీంతో పిల్లలను ఇళ్ల నుంచి బయటకు పంపాలంటే భయపడాల్సి వస్తోందని, ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కోతులు, కుక్కల బెడద నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గ్రామంలో సంచరిస్తున్న కుక్కలు

60 శాతం భూసార పరీక్షలు పూర్తి

● వ్యవసాయాధికారి శ్రీహరి



సంగం, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూసార పరీక్షలు 60 శాతం పూర్తయ్యాయని, మరో వారంలో నూరుశాతం పూర్తి చేస్తామని మండల వ్యవసాయాధికారి శ్రీహరి తెలిపారు.

? భూ సార పరీక్షల వల్ల రైతులకు కలిగే ఉపయోగమేమిటి.

! భూమి యొక్క స్వభావం తెలుస్తుంది. భూమిలో ఏ ఖనిజాలు లోపించాయో తెలుస్తుంది. తద్వారా భూమికి ఎరువులు అందించి దిగుబడి పెంచేందుకు భూసార పరీక్షలు ఉపయోగపడతాయి.

? తీసిన శాంపిల్స్ ఫలితాలు ఎప్పుడు ఇస్తారు.

! భూసార పరీక్షల ఫలితాలు నెలరోజుల్లో అందచేస్తాం.

? పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నారా.

! ప్రతి రైతు సేవా కేంద్రంలో జనుము, జీలగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. జీలగలు 45 క్వింటాలు, జనుము 23 క్వింటాలు ఉన్నాయి. కావలసిన రైతులకు 50 శాతం రాయితీతో ఇస్తున్నాం.

? ఎడగారు సాగుకు ఏ రకం విత్తనాలు రైతులకు సూచిస్తున్నారు.

! ఎడగారులో కెఎన్ఎం 1638, కెఎన్ఎం 733, ఎన్ఎల్ఆర్ 34449, ఎన్ఎల్ఆర్ 3354 రకం విత్తనాలు సాగు చేయడం మంచిది. పంపిణీ చేసేందుకు ఇండెంట్ పెట్టి ఉన్నాం. త్వరలో వస్తాయి. రాగానే పంపిణీ చేస్తాం.

కాలువలో పూడికతీత



కాలువలో పూడిక తీస్తున్న ఎక్స్‌కవేటర్

అనంతసాగరం, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినగల్లు పంచాయతీ లక్కరాజుపల్లిలో కాలువలో పూడికతీత పనులను గురువారం జనసేన పార్టీ ఆత్మకూరు ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ తన సొంత నిధులతో చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఉదయగిరి రవి, నాయకులు అరబ్, ప్రసాద్, శరత్ తదితరులు పాల్గొన్నారు.